



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 11 సంచిక : 294 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం సోమవారం 30 జూన్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 294 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM MON 30 JUNE 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

# నిజం గడప దాటేలోగా...
# అబద్ధం ఊరంతా చుట్టి వస్తుంది!

- ప్రభుత్వ వార్షికోత్సవం సందర్భంగా 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం
- నెల రోజుల పాటు ప్రజల్లోకి వెళ్లాలని ఎమ్మెల్యేలు, ఎంపీలకు చంద్రబాబు ఆదేశం
- మనం చేసిన మంచి పనులను వివరిస్తూనే, వైసీపీ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపు
- ప్రతి ఎమ్మెల్యే పనితీరుపై సర్వేలు చేయిస్తున్నా.. బాగోకపోతే చర్యలు తప్పవని హెచ్చరిక
- తప్పులు పునరావృతం కావొద్దని, 2029 గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచన
- రాజకీయ ముసుగులో ఉన్న ఆర్థిక ఉగ్రవాదులతో ప్రమాదమని తీవ్ర విమర్శలు



పెన్ పవర్ డెస్క్:ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో ప్రతిపక్ష వైసీపీ పన్నుతున్న కుట్రలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా, నెల రోజుల పాటు ప్రజల్లో విస్తృతంగా పర్యటించాలని ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నేతలకు ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం నాడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, పరిశీలకులతో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడు గు' కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్పష్టం చేశారు.

**తప్పులు రిపీట్ చేయొద్దు!**

గతంలో తాము చేసిన తప్పులు పునరావృతం కాకూడదని చంద్రబాబు గట్టిగా హెచ్చరించారు. నిజం గడప దాటేలోగా... అబద్ధం ఊరంతా చుట్టి వస్తుంది... అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. "2014లో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశాం. కానీ, వాటిని ప్రజల్లోకి సరిగా తీసుకెళ్లలేక పోయాం, రాజకీయం మరిచిపోయాం. చాపకింద నీరులా టీడీపీపై అబద్ధాలను ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారు. వివేకానందరెడ్డి హత్యే దీనికి పెద్ద ఉదాహరణ. గుండెపోటు అని మొదట ప్రచారం చేసి, ఆ తర్వాత నాటకాలు ఆడి ప్రజల సానుభూతి పొందారు. కోడికత్తి డ్రామా, ఎన్నికల ముందు గులకరాయి డ్రామా వంటివి వారి కుట్ర రాజకీయాలకు నిదర్శనం. ఇలాంటి దుష్ప్రచారాలను తేలిగ్గా తీసుకోవద్దు. మనం చేస్తున్న మంచిని ఎంత బలంగా వివరిస్తామో, వారి కుట్రలను కూడా అదే స్థాయిలో ప్రజలకు వివరించాలి" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**ప్రజలకు అందుబాటులో ఉంటే ఆదరిస్తారు... లేకుంటే టాటా చెప్పేస్తారు**

ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండడం ప్రాముఖ్యతను చంద్రబాబు నొక్కిచెప్పారు. "పనిచేయడం ఒక ఎత్తయితే, జనానికి అందుబాటులో ఉండటం మరో ఎత్తు. ప్రజల్లోకి వెళ్లడానికి

వివరాలు 2లో..



# హనీమూన్ పూర్తయింది... ఇక కష్టపడి పనిచేద్దాం

- 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంపై టీడీపీ విస్తృత స్థాయి సమావేశం
- నెల రోజుల పాటు ఇంటింటి ప్రచారం చేయాలని కార్యకర్తలకు లోకేష్ పిలుపు
- ఏడాది పాలనలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలని సూచన
- జూలై 5 నాటికి పార్టీ సంస్థాగత కమిటీల నియామకం పూర్తి చేయాలని ఆదేశం
- కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలని నేతలకు స్పష్టం
- సీనియర్లు, యువత సమన్వయంతో పార్టీని బలోపేతం చేయాలని దిశానిర్దేశం

పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా 'సుపరిపా లనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నెల రోజుల పాటు ప్రతి ఇంటికీ తీసుకెళ్లి విజయవంతం చేయాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు పిలుపుని చ్చారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో నిర్వహిం చిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతో పాటు, పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

వివరాలు 2లో..

## చంద్రబాబుపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శనాస్త్రాలు



- కేటీఆర్ ఉద్యమం నుంచి వచ్చారు, చంద్రబాబులా దొడ్డిదారిలో రాలేదన్న ప్రవీణ్ కుమార్
- కేటీఆర్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తుంటే చంద్రబాబు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్న
- ఇప్పుడు మహా న్యూస్‌పై దాడిని ఖండిస్తూ నేతల గగ్గోలు పెడుతున్నారని ఆగ్రహం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సహా పలువురు నేతలు ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కేటీఆర్ విషయం లో ఒకలా,

వివరాలు 2లో..

## మాకు మంత్రి పదవులు ముఖ్యం కాదు.. ప్రజా సేవ ముఖ్యం



పెన్ పవర్ డెస్క్:తమకు మంత్రి పదవులు ముఖ్యం కాదు ప్రజా సేవే ముఖ్యమన్నారు మంత్రి వివేక్ వెంకట స్వామి. కాకా ఫ్యామిలీకే మూడు సీట్లు ఇచ్చారని విమర్శలు చేయడం సరికాదన్నారు. తమకు ప్రజాధరణ ఉంద కాబట్టే మూడు సీట్లు గెలిచామని చెప్పారు వివేక్. హైదరాబాద్ లో భీం సైనిక్ ఫౌండేషన్ సమ్మేళనంలో మంత్రి వివేక్ కు సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. కాకా వెంకటస్వామి పేదల కోసమే ఎప్పుడూ ఆలోచించేవారు. కాకా ఏది ఆలోచించేవారో అదే చేసేవారు. ఆ రోజుల్లనే కాకా అన్నపూర్ణ క్యాంటీన్లు పెట్టారు. 27 వేల మంది కార్మికులకు ఇంటి స్థలాలు ఇప్పించారు. ప్రైవేట్ సెక్టార్ లో పెన్షన్ తీసుకొచ్చింది కాకానే. కాకా అడుగు జాడల్లోనే మేం నడుస్తున్నాం.

వివరాలు 2లో..

# మహా న్యూస్ పై దాడి... గెల్లు శ్రీనివాస్ అరెస్ట్... మధుసూదనాచారి, బాల్క సుమన్ పై కేసు



- హైదరాబాద్‌లోని మహా న్యూస్ ఛానల్ కార్యాలయంపై దాడి
- బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ అరెస్ట్
- అరెస్టును అడ్డుకున్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి, నేత బాల్క సుమన్‌పై కేసు
- దాడి వెనుక బీఆర్ఎస్ ఉందని ఆరోపించిన కాంగ్రెస్
- ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని ప్రస్తావిస్తూ బీఆర్ఎస్‌పై మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు
- దాడికి ముందు ఛానల్‌ను విమర్శిస్తూ కేటీఆర్ సోషల్ మీడియా పోస్ట్

వివరాలు 2లో..

# విద్యావ్యవస్థ అస్తవ్యస్తం... ఏపీఈసెట్ అడ్మిషన్లే పెద్ద ఉదాహరణ

- ఈసెట్ కౌన్సెలింగ్‌లో తీవ్ర జాప్యం అంటూ ప్రభుత్వంపై విరుచుకుపడిన జగన్
- ఫలితాలొచ్చి 45 రోజులైనా అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాలేదని విమర్శ
- "అమాత్యా మేలుకో, పప్పూ నిద్ర వదులు" అంటూ ఘాటు వ్యాఖ్యలు



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం విద్యావ్యవ స్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, అందుకు ఏపీ ఈసెట్ అడ్మిషన్ల ప్రక్రియలో జరుగుతున్న తీవ్ర జాప్యమే నిదర్శనమని

వివరాలు 2లో..

## అహ్మదాబాద్ విమాన ప్రమాదం వెనుక కుట్రకోణం?

- ఎయిరిండియా విమాన ఘటనపై కుట్ర కోణంలోనూ దర్యాప్తు
- విదేశాలకు బ్లాక్‌బాక్స్ పంపబోమని స్పష్టం చేసిన కేంద్రం
- రెండు ఇంజిన్లు ఒకేసారి ఆగిపోవడం అరుదైన ఘటన అన్న మంత్రి
- మూడు నెలల్లో దర్యాప్తు పూర్తి చేసి నివేదిక వెల్లడి
- దేశంలోని 33 డ్రీమ్‌లైనర్ విమానాలకు క్షుణ్ణంగా తనిఖీలు
- డీజీసీఏలో 419 టెక్నికల్ పోస్టుల భర్తీకి చర్యలు



పెన్ పవర్ డెస్క్:ఎయిరిండియాకు చెందిన ఏఐ 171 విమానం అహ్మదా బాద్ లో దుర్ఘటనకు గురై 260 మంది మృతి చెందడం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అహ్మదాబాద్ నుంచి లండన్ వెళుతున్న ఈ విమానం టేకాఫ్ తీసుకున్న కొన్ని క్షణాలకే ఓ మెడికల్ కాలేజీ హాస్టల్ పై కుప్పకూ లింది. అయితే ఈ ప్రమాదం వెనుక కుట్రకోణం ఉండే

వివరాలు 2లో..



# మమ్మల్ని పట్టుకోలేరు...

## బీజేపీ ఎంపీ రఘునందన్ కు మరోసారి బెదిరింపులు

- బీజేపీ ఎంపీ రఘునందన్‌రావుకు మరోసారి బెదిరింపు కాల్స్
- 'ఆపరేషన్ కగార్' ఆపాలంటూ ఆగంతకుల డిమాండ్
- ఏపీ మావోయిస్టు కమిటీ పేరుతో ఇంటర్నెట్ ద్వారా ఫోన్లు
- హైదరాబాద్‌లోనే ఐదు బృందాలున్నాయని హెచ్చరిక
- ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఘటన.. పోలీసులకు ఫిర్యాదు
- కొద్ది రోజుల క్రితమే ఓసారి హెచ్చరికలు.. అదనపు భద్రత ఏర్పాటు

వివరాలు 2లో..

## హైదరాబాద్ ఎల్లారెడ్డిగూడ పార్కులో ఆక్రమణలు తొలగించిన హైడ్రా..

# దశాబ్దాల పోరాటం హైడ్రాతో రోజుల్లో పరిష్కారం

పెన్ పవర్ డెస్క్:హైదరాబాద్ లో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతోంది హైడ్రా. ప్రభుత్వ స్థలాలు, చెరువులపై ఆక్రమణలను ఎక్కడికక్కడ కూల్చేస్తూ దూకుడు ప్రదర్శిస్తోంది హైడ్రా. ఈ క్రమంలో ఆదివారం ( జూన్ 29 ) హైదరాబాద్ లోని మధురానగర్ మెట్రో స్టేషన్ సమీపంలోని ఎల్లారెడ్డిగూడ పార్కులో ఆక్రమణలను తొలగించింది హైడ్రా. ఆక్రమణలు తొలగించి 1533 గజాల విస్తీర్ణంలో పార్కును అందుబాటులోకి తెచ్చింది హైడ్రా. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. స్థానిక సాయి సారధి నగర్ లేఔట్ లో 1961 నుంచి ఆక్రమణలు ఉన్నాయని.. సాయి సారధీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

వివరాలు 2లో..



# ఇక మీకు రఫా రఫానే..

## పెద్దారెడ్డికి జేసీ ప్రభాకర్ రెడ్డి మాస్ వార్నింగ్!



- తాడిపత్రిలో మరోసారి భగ్గుమన్న రాజకీయ వైరం
- తాను మూడు రోజులు ఊళ్లో ఉండటం లేదని జేసీ ప్రకటన
- నీ ఇల్లు కూలగొట్టేస్తారేమో అంటూ వ్యాఖ్యలు
- తన శత్రువు పెద్దారెడ్డే కానీ వైసీపీ కార్యకర్తలు కాదన్న జేసీ
- తన పోరాటం చట్టబద్ధంగానే ఉంటుందని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గంలో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తన రాజకీయ ప్రత్యర్థి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# దారికొస్తారా?

పనితీరు పై పెదవి విరుపు.. ఎమ్మెల్యేలపై చంద్రబాబు ఆగ్రహం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యేల పనితీరుపై చాలా వరకూ అసంతృప్తిగా ఉన్నారని తెలిసింది. ఎక్కువ మంది ఎమ్మెల్యేలు జనాగ్రహాన్ని ఎదుర్కొంటున్నట్లు వివిధ సర్వేల ద్వారా నివేదికలు తెప్పించుకున్న చంద్రబాబు నేడు ఎమ్మెల్యేలకు క్లాస్ పీకే అవకాశముందని తెలిసింది. జులై రెండో తేదీ నుంచి ఇంటింటికి తొలి అడుగు కార్యక్రమంపై ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేయడానికి రాష్ట్ర పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని చంద్రబాబు ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కార్యక్రమంపై సూచనలు చేయనున్నారు. ప్రభుత్వం ఏడాది కాలం నుంచి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి తీసుకెళ్లాలని చంద్రబాబు చెప్పనున్నప్పటికీ ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేసే అవకాశముంది.

### సర్వేలు చేయించి...

అన్ని నియోజకవర్గాల్లో ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా సర్వే చేయించారు. దీంతో పాటు ప్రయివేటుసంస్థ నుంచి కూడా సర్వేలు చేయించారు. అన్నింటిలో ఎమ్మెల్యేలపై ఒకటే వ్యతిరేకత. మద్యం షాపుల్లో దందా. ఉచిత ఇసుకలో దోపిడీ. కాంట్రాక్టు పనుల్లో వైసీపీ నేతలతో లాలూచీ వంటి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా గత ఎన్నికలలో పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను మరిచిపోయి వైసీపీ కార్యకర్తలకు కమీషన్లకోసం కక్కుర్తి పడి కాంట్రాక్టు పనులను అప్పగిస్తున్నట్లు కూడా ఫిర్యాదులు వస్తున్నాయి. టీడీపీకి గత ఎన్నికల్లో గెలిచిన నియోజకవర్గాల్లో కొందరు సీనియర్ నేతలు గెలిచిన చోట్ల మినహా మిగిలిన చోట్ల దాదాపు పరిస్థితి ఇలాగే ఉందన్న సర్వే నివేదికలు చంద్రబాబును కలవరానికి గురిచేశాయంటున్నారు.

### మళ్లీ టిక్కెట్ కావాలంటే...

ఎమ్మెల్యేలను ఇప్పుడు గాడిలో పెట్టకపోతే ఇక రానున్న కాలంలో మరింత రాటు దేలి పోయి పార్టీ మరింత డ్యామేజీ అవుతుందని భావించిన చంద్రబాబు ఈ సమావేశంలో వారిపై సీరియస్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మళ్లీ టిక్కెట్ కావాలంటే పనితీరు ఆధారంగానే ఎంపిక చేస్తామని స్ట్రాంగ్ వార్నింగ్ ఇస్తారని అంటున్నారు. పనితీరు బాగాలేకపోయినా, ఆరోపణలతో పాటు ప్రజా వ్యతిరేక ఉన్నట్లు కనిపడితే నిర్దాక్షిణ్యంగా పక్కన పెడతానని కూడా చంద్రబాబు హెచ్చరికలు జారీ చేసే అవకాశముంది. ఇది ఫస్ట్ వార్నింగ్ కింద తీసుకోవాలని, ఏదో అనుకుని ఇలాగే వ్యవహరిస్తే ఎమ్మెల్యేగా ఉన్నా నియోజకవర్గాలకు కొత్త ఇన్ ఛార్జిని ఎంపిక చేస్తానని కూడా చంద్రబాబు సంకేతాలు ఇచ్చే ఛాన్స్ ఉందని అంటున్నారు.

### ఎమ్మెల్యేల వాదన ఇలా...

అయితే ఎమ్మెల్యేలు మాత్రం కార్యకర్తలు వత్తిడి తెచ్చినందుకు తాము మద్యం, ఇసుక వంటి వాటిలో తలదూర్చాల్సి వస్తుందని అంటున్నారు. ఎక్కువ మంది వ్యక్తిగత సమస్యలతో తమ దగ్గరకు వస్తున్నారని, వాటిని పరిష్కరించడం కష్టంగా మారుతుందని చెబుతున్నారు. అలాగే ద్వితీయ శ్రేణి నేతలు కూడా నియోజకవర్గాల్లో ఎవరి యాపారం వారే చేసుకుంటున్నందున తాము కొన్నింటిలో తప్పనిసరి పరిస్థితుల్లో తలదూర్చాల్సి వస్తుందని, మొన్నటి ఎన్నికల్లో గెలుపునకు తామే కారణమన్న అభిప్రాయంతో ఎక్కువ మంది ఉండటంతో వారి కోర్కెలను తీర్చలేకపోతున్నామని కొందరు ఎమ్మెల్యేలు వాపోతున్నారు. మొత్తం మీద ఎమ్మెల్యేల వాదనలో కొంత నిజమున్నప్పటికీ డ్యామేజీ అయ్యేది పార్టీ కాబట్టి వీటి నుంచి ఎలా బయటపడతారన్నది చూడాలి.

## విద్యావ్యవస్థ అస్తవ్యస్తం... ఏపీఈసెట్ అడ్మిషన్లే పెద్ద ఉదాహరణ

- మొదటి పేజీ తరువాయి

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఫలితాలు వెలువడి నెలన్నర రోజులు గడుస్తున్నా ఇంతవరకు కౌన్సెలింగ్ ప్రారంభించకపోవడం ప్రభుత్వ అసమర్థతకు పరాకాష్ఠ అని విమర్శించారు. ఈసెట్ ఫలితాలు గత నెల మే 15వ తేదీన వెలువడినా, నేటికీ అడ్మిషన్ల ప్రక్రియపై ఎలాంటి షెడ్యూల్ విడుదల చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని జగన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ఎంత దారుణంగా అస్తవ్యస్తంగా మారిందో చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలని ఆయన అన్నారు. రేపటి నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులకు తరగతులు ప్రారంభం కానుండగా, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేశారని ఆయన ఆరోపించారు.

ఈ సందర్భంగా ఆయన "అమాత్యా మేలుకో.. పప్పూ నిద్ర వదులు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు.

ఈ ఏడాది ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశాల కోసం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 34 వేల మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఈసెట్ పరీక్షకు హాజరుకాగా, వారిలో 31,922 మంది అర్హత సాధించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇంతమంది విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని జగన్ ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి, ఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసి, అడ్మిషన్ల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

## ఇక మీకు రఫా రఫానే..

- మొదటి పేజీ తరువాయి

తాను కొన్ని రోజుల పాటు ఊరిలో ఉండటం లేదని, ఈ సమయంలో ఇంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని, లేదంటే కూల్చివేస్తారేమోనని జేసీ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతున్నాయి. ఇక మీకు రఫా రఫా తప్పదని హెచ్చరించారు.

తాజాగా తన అనుచరులతో మాట్లాడిన జేసీ ప్రభాకర్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. "నేను ఊరికి వెళుతున్నా. ఓ మూడు రోజుల్లో నీ ఇంటిని ప్రొక్లైనర్ పెట్టి కూల్చేస్తారేమో.. కాపాడుకో పెద్దారెడ్డి. నీకోసమే కాచుకుని ఉన్నారు" అంటూ బహిరంగంగా హెచ్చరించారు. తన కార్యకర్తలు తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారని, ఇన్నాళ్లూ తానే వారిని అదుపు చేస్తూ వచ్చానని తెలిపారు. "మా వాళ్లు చాలా కోపంగా ఉన్నారు. రఫ్ఫాడించడానికి సిద్ధంగా ఉన్నారు. నేను గట్టిగా పట్టుకుని కూర్చున్నాను కాబట్టే ఆగుతున్నారు. నేను లేనప్పుడు ఏం జరుగుతుందో చూసుకో" అని వ్యాఖ్యానించారు.

గత ప్రభుత్వ హయాంలో తాము, తమ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు పడ్డామని, మహిళలు కూడా జైలుకు వెళ్లారని జేసీ గుర్తుచేశారు. ఆ కక్షతోనే తన అనుచరులు రగిలిపోతున్నారని ఆయన పేర్కొన్నారు. అయితే, తన శత్రుత్వం కేవలం కేతిరెడ్డి పెద్దారెడ్డితోనే తప్ప, వైసీపీ కార్యకర్తలతో కాదని ఆయన స్పష్టం చేశారు. "మాకు శత్రువు పెద్దారెడ్డి మాత్రమే, వైసీపీ కార్యకర్తలు కాదు. ఇప్పటివరకు మేం ఏ కార్యకర్తను ఏమీ అనలేదు. అందరిపైనా చట్ట ప్రకారమే ముందుకెళుతున్నాం," అని జేసీ వివరించారు. పెద్దారెడ్డి ఇంటి నిర్మాణంలో కూడా చట్టపరమైన లోపాలు ఉన్నాయని, అయినా తాము చట్టబద్ధంగానే వెళుతున్నామని తెలిపారు.

ఈ సందర్భంగా తన పోరాటం వ్యక్తిగతమని, తాను, తన పిల్లలు ఈ శత్రుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ప్రభాకర్ రెడ్డి తేల్చిచెప్పారు. ప్రజలకు తాను ఏంటో తెలుసని, అందుకే తనను గెలిపించారని అన్నారు. జేసీ చేసిన ఈ వ్యాఖ్యలతో తాడిపత్రిలో మరోసారి రాజకీయ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

## హైదరాబాద్ ఎల్లారెడ్డిగూడ పార్కులో ఆక్రమణలు తొలగించిన హైడ్రా..

- మొదటి పేజీ తరువాయి

ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు చర్యలు చేపట్టింది హైడ్రా. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో విచారణ చేపట్టిన అధికారులు ఆక్రమణలు తొలగించారు. 1961లో 5 ఎకరాల విస్తీర్ణంలో సాయి సారథి నగర్ పేరిట 35 ప్లాట్లతో లేఔట్ ఏర్పాటు చేశారని.. 1533 గజాల స్థలాన్ని పార్కుగా చూపించారని నిర్ధారించారు అధికారులు. నారాయణ ప్రసాద్ వారసులు పార్కు స్థలంలో షెడ్డు వేసి.. ఖాళీ చేయకుండా ఆక్రమణలో ఉన్న స్థలంలో లేఔట్ వేసినట్లు ఫిర్యాదు చేశారు స్థానికులు. వ్యవస్థలను మేనేజ్ చేసుకొని ఇంటి నంబర్ కూడా తెచ్చుకున్నట్లు పేర్కొన్నారు. ఈ లేఔట్లో 6 రోడ్లను అభివృద్ధి చేసి పార్కును మాత్రం ఖాళీ చేయించలేదని.. పలుమార్లు జీహెచ్ఎంసీకి కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు స్థానికులు. స్థానికుల ఫిర్యాదుతో క్షేత్ర స్థాయిలో వివిధ శాఖలతో కలసి పూర్తి స్థాయి విచారణ చేపట్టిన హైడ్రా అధికారులు.. కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించారు.

అనంతరం పార్కు స్థలంగా గుర్తించి ప్రొటెక్టెడ్ బై హైడ్రా బోర్డు పెట్టారు అధికారులు. దశాబ్దాల పోరాటం హైడ్రాతో రోజుల్లో పరిష్కారం అయ్యిందంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు స్థానికులు.

# మహా న్యూస్ పై దాడి... గెల్లు శ్రీనివాస్ అరెస్ట్... మధుసూదనాచారి, బాల్క సుమన్ పై కేసు

హైదరాబాద్‌లోని ప్రముఖ తెలుగు న్యూస్ ఛానల్ 'మహా న్యూస్' కార్యాలయంపై జరిగిన దాడి ఘటనలో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ దాడికి సంబంధించి బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను ఆదివారం అరెస్ట్ చేసినట్లు హైదరాబాద్ పోలీసులు వెల్లడించారు. అంతేకాకుండా, ఆయన అరెస్టును అడ్డుకునేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ సీనియర్ నేతలు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎంపీ బాల్క సుమన్‌పైనా కేసు నమోదు చేశారు.

### పోలీసుల విధులకు ఆటంకం

శనివారం జూబ్లీహిల్స్‌లోని మహా న్యూస్ కార్యాలయంపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను అరెస్ట్ చేసేందుకు బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌కు వెళ్లారు. ఆ సమయంలో మధుసూదనాచారి, బాల్క సుమన్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని ఆరోపిస్తూ బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో వారిపై మరో కేసు నమోదు చేశారు. దాడి ఘటనలో నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద కేసులు బుక్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

### దాడిని ఖండించిన కాంగ్రెస్

ఈ దాడిని అధికార కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదివారం మహా న్యూస్ కార్యాలయాన్ని సందర్శించి, జర్నలిస్టులు, సిబ్బందికి సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ దాడి వెనుక బీఆర్ఎస్ హస్తం ఉందని ఆరోపించారు. తమ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ పాపం బయటపడుతుందనే భయంతోనే బీఆర్ఎస్ ఇలాంటి దాడులకు పాల్పడుతోందని విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్‌కు తెలియకుండా ఫోన్ ట్యాపింగ్ జరిగే అవకాశం లేదని, ఈ అంశంపై కేసీఆర్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

"రాజకీయ నాయకుల ఫోన్లే కాకుండా, వారి కుటుంబ సభ్యులు, సినీ ప్రముఖులు, న్యాయమూర్తులు, మహిళా అధికారుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు. దీనివల్ల ఎన్నో కుటుంబాల్లో చిచ్చు పెట్టారు," అని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యత మీడియాకు ఉందని, తమపై పెయిడ్ ఛానళ్లలో ఎన్నో వ్యతిరేక కథనాలు వచ్చినా తాము ఎప్పుడూ భౌతిక దాడులకు దిగలేదని ఆయన స్పష్టం చేశారు. కేటీఆరే స్వయంగా గూండాలను రెచ్చగొట్టి దాడులు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు.

### జర్నలిస్టుల ముసుగులో... అంటూ కేటీఆర్ సోషల్ మీడియా పోస్ట్

దాడి జరగడానికి ముందు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సదరు ఛానల్ ప్రసారం చేసిన ఒక బులెటిన్‌ను విమర్శిస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. "జర్నలిస్టుల ముసుగులో ఉన్న కొందరు నీచులు గత కొన్ని నెలలుగా నాపైనా, మా పార్టీ నాయకత్వంపైనా విషం చిమ్ముతున్నారు. వారి అభిప్రాయాలను నేను పట్టించుకోను. కానీ, పదేపదే వ్యక్తిత్వ హననానికి పాల్పడటం నా కుటుంబం, స్నేహితులు, పార్టీ శ్రేణులను బాధిస్తోంది. ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాను. ఈ వ్యవస్థీకృత దాడుల వెనుక ఎవరున్నారో నాకు బాగా తెలుసు, వారితో తగిన రీతిలో వ్యవహరిస్తాను" అని కేటీఆర్ తన పోస్టులో హెచ్చరించారు. ఈ పోస్ట్ చేసిన కొద్దిసేపటికే దాడి జరగడం గమనార్హం.

# మమ్మల్ని పట్టుకోలేరు...

తెలంగాణ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావుకు బెదిరింపుల పర్వం కొనసాగుతోంది. ఇటీవల కాలికి శస్త్రచికిత్స చేయించుకుని హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనకు, మరోసారి ప్రాణహాని తలపెడతామంటూ మరోసారి హెచ్చరికలు వచ్చాయి. ఆదివారం రెండు వేర్వేరు ఫోన్ నంబర్ల నుంచి కాల్స్ చేసిన ఆగంతకులు, ఛత్తీస్ గఢ్ లో 'ఆపరేషన్ కగార్'ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తాము ఏపీ మావోయిస్టు కమిటీకి చెందిన వారిమని, తమ ఆదేశాల మేరకు ఐదు ప్రత్యేక బృందాలు ఇప్పటికే హైదరాబాద్‌లో రంగంలోకి దిగాయని వారు చెప్పినట్టు సమాచారం. "మా టీమ్‌లు నగరంలోనే ఉన్నాయి. మరికాసేపట్లోనే నిన్ను చంపేస్తాం. దమ్ముంటే నిన్ను నువ్వు కాపాడుకో" అంటూ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. పోలీసులు తమ ఫోన్లను ట్రేస్ చేసేందుకు ప్రయత్నిస్తున్నా తమ ఆచూకీ దొరకదని, ఎందుకంటే తాము ఇంటర్నెట్ కాల్స్ ఉపయోగిస్తున్నామని ఆ వ్యక్తులు స్పష్టం చేశారు. ఏ పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని వారు తేల్చిచెప్పినట్లు తెలిసింది. రఘునందన్‌రావుకు ఇలాంటి బెదిరింపులు రావడం ఇది రెండోసారి. గత జూన్ 23న తొలిసారిగా ఆయనకు బెదిరింపు కాల్ వచ్చింది. ఆ సమయంలోనే ఆయన రాష్ట్ర డీజీపీతో పాటు మెదక్, సంగారెడ్డి ఎస్పీలకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం ఆయనకు భద్రతను పెంచి, ఎస్కార్ట్ వాహనంతో పాటు అదనపు సిబ్బందిని కేటాయించింది. అయినప్పటికీ బెదిరింపులు ఆగకపోవడం ఆందోళన కలిగిస్తోంది. రెండు రోజుల క్రితమే కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న రఘునందన్‌రావు, ప్రస్తుతం ఆసుపత్రిలోనే కోలుకుంటున్నారు. ఈ క్రమంలోనే తాజా బెదిరింపులు రావడంతో ఆయన ఆసుపత్రి నుంచే మరోమారు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ ప్రారంభించారు.

## హనీమూన్ పూర్తయింది... ఇక కష్టపడి పనిచేద్దాం

- మొదటి పేజీ తరువాయి

టెక్నాలజీతో పనితీరు గుర్తింపు

నెల రోజుల పాటు జరిగే 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో కుటుంబ సాధికార సారథి నుంచి పొలిట్‌బ్యూరో సభ్యుల వరకు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని లోకేశ్ పిలుపునిచ్చారు. ఇంటింటి ప్రచారం సందర్భంగా ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్‌ను 'మై టీడీపీ' యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. బాగా పనిచేసిన కార్యకర్తలను సాంకేతిక పరిజ్ఞానం సాయంతో గుర్తించి, సత్కరించాలని తెలిపారు. "ఏడాది హనీమూన్ పూర్తయింది, ఇక అందరం కష్టపడి పనిచేయాలి" అని చెబుతూ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు.

### ప్రభుత్వ విజయాలు ప్రజల వద్దకు!

ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని లోకేశ్ అన్నారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ 'తల్లికి వందనం' అమలు చేశామని, దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకటో తేదీనే పింఛన్లు అందిస్తున్నామని గుర్తుచేశారు. అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించామని, ఇచ్చిన ప్రతి హామీని పద్ధతి ప్రకారం నెరవేర్చేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని తెలిపారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్పష్టం చేశారు.

### పార్టీయే సుప్రీం.. కార్యకర్తలే బలం

2024 ఎన్నికల్లో ఊహించని విజయం వెనుక కార్యకర్తల కష్టం ఎంతో ఉందని లోకేశ్ కొనియాడారు. క్లస్టర్, యూనిట్, బూత్ (కబ్) వ్యవస్థ వల్లే పార్టీ క్షేత్రస్థాయిలో బలపడిందని అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వేధింపులు, అక్రమ కేసులు ఎదుర్కొని, జైళ్లకు వెళ్లిన కార్యకర్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ మరువద్దని ఎమ్మెల్యేలు, మంత్రులకు సూచించారు. పార్టీయే సుప్రీం అని, ప్రపంచం మొత్తం తిరిగినా మనందరం తిరిగి వచ్చేది దేవాలయం లాంటి పార్టీ కార్యాలయానికే అని ఆయన ఉద్ఘాటించారు.

### సంస్థాగత నిర్మాణంపై ప్రత్యేక దృష్టి

పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయాలని లోకేశ్ ఆదేశించారు. జూలై 5వ తేదీలోగా క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీలతో పాటు అనుబంధ విభాగాల నియామకాలు పూర్తి చేయాలని డెడ్‌లైన్ విధించారు. మహిళలను ప్రోత్సహించేందుకు 'కబ్' వ్యవస్థలో కో-కన్వీనర్ పదవిని సృష్టించామని, కమిటీలలో మహిళలు, యువతకు పెద్దపీట వేయాలని సూచించారు. నియోజకవర్గాల్లో సంస్థాగత నిర్మాణంపై ఎమ్మెల్యేలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కుప్పంలో చంద్రబాబు వరుస విజయాలకు ఇదే కారణమని గుర్తుచేశారు.

### సీనియర్లు, యువత సమన్వయం

పార్టీకి నాలుగు దశాబ్దాలుగా సీనియర్లు అండగా నిలిచారని, వారి అనుభవాన్ని విస్మరించకూడదని లోకేశ్ అన్నారు. సీనియర్ల అనుభవాన్ని, యువత శక్తిని జోడించి పార్టీని ముందుకు నడపాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. పార్టీ పదవుల పంపిణీలో అందరినీ కలుపుకొనిపోతూ దామాషా పద్ధతి పాటించాలని సూచించారు. నియోజకవర్గాల్లో బాగా పనిచేసిన వారిని గుర్తించి ప్రోత్సహించాలన్నారు.

## నిజం గడప దాటేలోగా... అబద్ధం ఊరంతా చుట్టి వస్తుంది!

- మొదటి పేజీ తరువాయి

ఎలాంటి నామోషీ వద్దు. చేసిన పనులతో పాటు, చేయలేని పనులకు గల కారణాలను కూడా వివరించాలి. ప్రజలకు ఎంత దగ్గరగా ఉంటే, వారు అంతగా ఆదరిస్తారు. లేదంటే నిర్మొహమాటంగా టాటా చెప్పేస్తారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మన పనితీరు ఉండాలి" అని సూచించారు.

### ప్రతి ఒక్క ఎమ్మెల్యేతో మాట్లాడతా... మంచి చెడులు వివిస్తా

ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరును తాను నిరంతరం గమనిస్తున్నానని, వివిధ మార్గాల్లో సర్వేలు చేయిస్తున్నానని చంద్రబాబు వెల్లడించారు. "ప్రతి ఎమ్మెల్యేతో త్వరలోనే నేను స్వయంగా సమావేశమవుతాను. ఇప్పటికే నలుగురితో మాట్లాడాను. వారు చెప్పేది ఓపిగ్గా వింటాను. వారిలో ఏమైనా లోపాలుంటే సరిదిద్దుకోవడానికి సమయం ఇస్తాను. మారితే సంతోషం, లేదంటే నిర్ణయం తీసుకోవడానికి వెనుకాడను. వారసులైనా సరే, కష్టపడి పనిచేస్తేనే గుర్తింపు ఉంటుంది. పని చేయకుండా పదవులు ఆశిస్తే కుదరదు, వారికో నమస్కారం పెట్టేస్తా" అని చంద్రబాబు తీవ్రంగా హెచ్చరించారు.

### ప్రజలకు జవాబుదారీగా ఉందాం... పొరపాట్లు ఉంటే సరి చేసుకుందాం

పాలనలో ఏమైనా లోటుపాట్లు, పొరపాట్లు ఉంటే సరిదిద్దుకుని ముందుకు సాగుదామని చంద్రబాబు అన్నారు. "ప్రజలు మెచ్చాలి, కార్యకర్తలు ఆమోదించాలి. అదే మన లక్ష్యం. పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన కార్యకర్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ మర్చిపోవద్దు. డబ్బులు పంచి ఎన్నికల్లో గెలవాలనుకోవడం బాధాకరం. గత ఎన్నికల్లో ప్రత్యర్థులు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేసినా 11 సీట్లకే పరిమితమయ్యారు. డబ్బు అన్నివేళలా పనిచేయదు. మనం ఆదర్శవంతమైన రాజకీయాలు చేద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు.

### ప్రభుత్వ కొనసాగింపుతోనే అభివృద్ధి... కళ్ల ముందున్న వాస్తవమిది

సుస్థిర ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని చంద్రబాబు అన్నారు. "2004, 2019లో టీడీపీ ఓడిపోవడం వల్ల రాష్ట్రం తిరోగమనం పట్టింది. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింది. ఇప్పుడు మళ్లీ పారిశ్రామికవేత్తలు నమ్మకంతో ముందుకొస్తున్నారు. ఏడాదిలోనే రూ. 9.34 వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. దీని ద్వారా 8.50 లక్షల ఉద్యోగాలు వస్తాయి" అని తెలిపారు. పోలవరం, అమరావతి పనులు వేగవంతం చేశామని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను లాభాల బాట పట్టిస్తున్నామని వివరించారు.

### కార్యకర్తలను మరువొద్దు

సంక్షేమంలోనూ, అభివృద్ధిలోనూ తమ ప్రభుత్వం ముందుందని చంద్రబాబు పేర్కొన్నారు. "64 లక్షల మందికి పెన్షన్లు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, డీఎస్సీ నోటిఫికేషన్, అన్నా క్యాంటీన్లు వంటి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తాం. విధానాలు

ఎంత బాగున్నా, వాటి అమలులో లోపాలుంటే ప్రయోజనం ఉండదు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో బాధ్యతగా పనిచేయాలి. 2029లో గెలుపే నా ప్రణాళిక. అందుకోసం కష్టపడి పనిచేయడం కాదు, స్మార్ట్‌గా పనిచేయాలి" అని చంద్రబాబు నేతలకు స్పష్టం చేశారు. రాజకీయ ముసుగు వేసుకున్న ఆర్థిక ఉగ్రవాదులు, రౌడీలతో రాష్ట్రానికి ప్రమాదమని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.

## అహ్మదాబాద్ విమాన ప్రమాదం వెనుక కుట్రకోణం?

- మొదటి పేజీ తరువాయి

అవకాశాలున్నట్టు వాదనలు వినిపిస్తున్నాయి. దీనిపై కేంద్రం స్పందించింది. ఈ ఉదంతంలో కుట్ర కోణంపై కూడా దృష్టి సారించినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తును ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) చేపట్టిందని, అన్ని కోణాల్లోనూ విచారణ జరుపుతోందని ఆయన స్పష్టం చేశారు. పుణెలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. విమానం నుంచి స్వాధీనం చేసుకున్న బ్లాక్‌బాక్స్‌ను విశ్లేషణ కోసం విదేశాలకు పంపుతున్నారంటూ వస్తున్న ఊహాగానాలను మంత్రి మురళీధర్ పూర్తిగా ఖండించారు. "బ్లాక్‌బాక్స్ మన దేశంలోనే, దర్యాప్తు సంస్థల వద్దే సురక్షితంగా ఉంది. దానిని ఎక్కడికీ పంపే ప్రసక్తే లేదు" అని ఆయన తేల్చిచెప్పారు. ఇది చాలా విషాదకరమైన ఘటన అని, ఏఏఐబీ దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభించిందని తెలిపారు. సీసీటీవీ ఫుటేజీని విశ్లేషించడంతో పాటు పలు ఏజెన్సీలు సమన్వయంతో పనిచేస్తున్నాయని వివరించారు. రెండు ఇంజిన్లు ఒకేసారి విఫలం కావడం అనేది అత్యంత అరుదైన విషయమని మంత్రి పేర్కొన్నారు. "ఇది చాలా ప్రత్యేకమైన కేసు. అసలు రెండు ఇంజిన్లు విఫలమయ్యాయా లేక ఇంధన సరఫరాలో ఏమైనా సమస్య తలెత్తిందా అనేది దర్యాప్తు నివేదిక వస్తేనే స్పష్టత వస్తుంది" అని ఆయన అన్నారు. బ్లాక్‌బాక్స్‌లోని కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో పైలట్ల సంభాషణలు నిక్షిప్తమై ఉంటాయని, దర్యాప్తులో అది కీలకం కానుందని తెలిపారు. మరో మూడు నెలల్లో నివేదిక వచ్చే అవకాశం ఉందని, కాబట్టి ఇప్పుడే దీనిపై ఏమీ మాట్లాడటం తొందరపాటు అవుతుందని మురళీధర్ అభిప్రాయపడ్డారు. ఈ ఘటన నేపథ్యంలో ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి హామీ ఇచ్చారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆదేశాల మేరకు దేశంలో వినియోగంలో ఉన్న మొత్తం 33 డ్రీమ్‌లైనర్ విమానాలను క్షుణ్ణంగా తనిఖీ చేశామని ఆయన చెప్పారు. ప్రయాణికులు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, సౌకర్యవంతంగా ప్రయాణిస్తున్నారని భరోసా ఇచ్చారు. అదే సమయంలో డీజీసీఏలో ఖాళీగా ఉన్న 419 సాంకేతిక సిబ్బంది పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మురళీధర్ వెల్లడించారు. ప్రైవేటు విమానయాన సంస్థలు తమంతట తాముగా నియామకాలు చేపట్టరాదని, డీజీసీఏ అనుమతి తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. ఎక్కువ గంటలు పనిచేయాలంటూ పైలట్లపై ఒత్తిడి తెచ్చే సంస్థల గురించి నేరుగా డీజీసీఏకు ఫిర్యాదు చేయవచ్చని ఆయన సూచించారు.

## చంద్రబాబుపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శనాస్త్రాలు

- మొదటి పేజీ తరువాయి

ఇతరుల విషయంలో మరోలా వ్యవహరిస్తూ తమ రెండు నాల్కల ధోరణిని బయటపెట్టుకుం టున్నారని ఆయన ధ్వజమెత్తారు. మహా న్యూస్ కార్యాలయంపై దాడి జరిగిందని ఆరోపణలు రాగానే ఖండనలు గుప్పిస్తున్న నేతలు, గతంలో జరిగిన ఘటనలను ఎందుకు విస్మరించారని ఆయన నిలదీశారు. "బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చంద్రబాబులా దొడ్డిదారిలో రాజకీయాల్లోకి రాలేదు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పోరాడి, ఇప్పటికీ ఉద్యమ సంబంధిత కేసులు ఎదుర్కొంటున్న నాయకుడు ఆయన" అని అన్నారు. అలాంటి కేటీఆర్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా మహా న్యూస్ అభ్యంతరకర థంబ్‌నెయిల్స్ పెట్టినప్పుడు చంద్రబాబు ఒక్క మాట కూడా మాట్లాడలేదని ఆరోపించారు. గతంలో జరిగిన కొన్ని సంఘటనలను ప్రస్తావిస్తూ, నేతల తీరును ప్రవీణ్ కుమార్ తప్పుబట్టారు. "గతంలో టీడీపీ కార్యకర్తలు డెక్కన్ క్రానికల్ మీడియా సంస్థపై దాడి చేసినప్పుడు చంద్రబాబు ఎందుకు స్పందించలేదు? ఇప్పుడు మహా న్యూస్‌పై దాడి జరిగిందని తెలియగానే పవన్ కల్యాణ్, చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీపీఐ నేతలు ఖండిస్తున్నామని అరవడం విడ్డూరంగా ఉంది. చంద్రబాబుకో న్యాయం, కేటీఆర్‌కో న్యాయమా?" అని ఆయన తీవ్రంగా ప్రశ్నించారు.

అసెంబ్లీలో తన భార్యను వైసీపీ నేత కొడాలి నాని దుర్భాషలాడారని ఆరోపిస్తూ చంద్రబాబు కన్నీళ్లు పెట్టుకున్నారని, ప్రెస్ మీట్ పెట్టి ఏడ్చిన విషయాన్ని ప్రవీణ్ కుమార్ ప్రస్తావించారు. "తన కుటుంబం విషయంలో అంతలా స్పందించిన చంద్రబాబు, కేటీఆర్ వ్యక్తిత్వ హననం జరుగుతున్నప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారు?" అని నిలదీశారు.

## మాకు మంత్రి పదవులు ముఖ్యం కాదు.. ప్రజా సేవ ముఖ్యం

- మొదటి పేజీ తరువాయి

పదవులకు ఆశపడకుండా తెలంగాణ ఉద్యమం చేశా. యూనియన్ మినిస్టర్ హోదా ఇస్తానన్నా ఉద్యమం ఆపలేదు. పెద్దపల్లిలో 2 వేల బోర్ వెల్స్ వేయించాం. మాకు మంత్రి పదవులు ముఖ్యం కాదు..ప్రజా సేవ ముఖ్యం. పెద్దపల్లి ప్రజలు మా ఫ్యామిలీని ఏండ్లుగా ఆదరిస్తున్నారు. ఉత్తర తెలంగాణ అన్ని సీట్లు బీజేపీ గెలిస్తే పెద్దపల్లిలో వంశీ గెలిచారు. కాకా ఫ్యామిలీకే 3 టికెట్లు ఇచ్చారని విమర్శలు చేయడం సరికాదు. మాకు ప్రజల ఆదరణ ఉంది కాబట్టే మేం మూడు సీట్లు గెలిచాం అని మంత్రి వివేక్ అన్నారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

## మానవత్వం చాటుకున్న ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి



**పులివెందుల పెన్ పవర్ జూన్ 29 :** కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే ఆదివారం సాయంత్రం పట్టణంలోని స్థానిక జేఎన్టీయూ కాలేజీ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. తొండూరు మండలం కృష్ణం గారి పల్లె నుంచి పాల ఆటో పులివెందులకు వస్తుండగా జేఎన్టీయూ సమీపంలోకి రాగానే అక్కడ చెత్త కాగితాలు ఏరుకునే గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా ఆ వ్యక్తి నీ ఆటో ఢీ కొట్టి ఆటో పల్టీ పడింది.. దీనితో కాగితాలు ఏరుకునే గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా ఆటోలో ప్రయాణిస్తున్న కృష్ణం గారి పల్లెకు చెందిన షబానా, శంషాద్ అని మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. అదే ఆటోలో ప్రయాణిస్తున్న కృష్ణం గారి పల్లెకు చెందిన హనుమంత్ రెడ్డికి నడుము భాగంలో గాయం కావడంతో అతను లేవలేని స్థితిలో రోడ్డుపైనే పడిపోయాడు. ఆ సమయంలో అటువైపుగా పులివెందులకు వస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తన కాన్వాయ్ నీ ఆపి క్రిందకు దిగి గాయాల పాలైన హనుమంత్ రెడ్డిని పరామర్శించి అప్పటికి అక్కడికి 108 వాహనం గాని చేరుకోక పోవడంతో తన సెక్యూరిటీ వాహనం ద్వారా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించాలని అనుచరులకు ఆదేశించారు. దీంతో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సెక్యూరిటీ వాహనంలో హుటాహుటిన గాయాలైన హనుమంత్ రెడ్డిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## టీడీపీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం విజయవంతం చేయాలి

### - ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



**శ్రీకాళహస్తి :పెన్ పవర్ ప్రతినిధి జూన్ 29 :** మంగళగిరి లోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే శ్రీ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలను ప్రజలకు విపులంగా వివరించాలన్నారు. నెల రోజులపాటు ప్రతి ప్రజాప్రతినిధి "సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమాన్ని నిబద్ధతతో నిర్వహించి, డోర్ టూ డోర్ ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికి చేరుకోవాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తల ఉత్సాహం కనివినీ ఎరుగనట్లు ఉండగా, రాబోయే రోజుల్లో ప్రజల విశ్వాసాన్ని మరింత బలపర్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నిర్ణయమైంది. తెలుగుదేశం పార్టీ పునర్వికాస పథకాలు, అభివృద్ధి లక్ష్యాలు, యువత కోసం కొత్త అవకాశాలపై ప్రత్యేకంగా చర్చించబడింది. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వం కింద రాష్ట్రానికి మళ్లీ స్వర్ణయుగం తీసుకురావడం కోసమే ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేస్తారని తెలిపారు.

### పచ్చదనం-పారిశుధ్యంలో

## పలమనేరును ప్రథమస్థానంలో నిలుపుదాం

### రూ.1.12 కోట్లతో ప్లాంటుకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**పలమనేరు జూన్ 29, (పెన్ పవర్) :** పచ్చదనం పారిశుధ్యమే స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యమని అందులో పలమనేరును ప్రథమస్థానంలో నిలుపుదామని ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పలమనేరు మునిసిపల్ పరిధిలోని 8వ వార్డులోని కంపోస్ట్ యార్డ్ నందు రూ. 1.12 కోట్లతో ఏర్పాటు చేయనున్న (బయో రేమిడియేషన్ మరియు బయో మైనింగ్ ద్వారా వ్యర్థ భూముల పునరుద్దరణ) ప్లాంటుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్యంలో పలమనేరు మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రజలందరూ ముందుకు రావాలని కోరారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో ఉత్పన్నమయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకొని ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాల్సిన అవసరముందన్నారు. దీంతో పాటు పారిశుధ్యాన్ని మెరుగు పరచుకునే కార్యక్రమాలు చేపడుతూనే పచ్చదనం పై దృష్టి సారించాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణానికి పెట్టింది పేరైన పలమనేరును పారిశుధ్య అంశంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు మనం కృషి చేద్దామని ఆయన కోరారు. అనంతరం కంపోస్ట్ యార్డ్ లోని వివిధ యూనిట్ లను ఆయన సందర్శించారు. తడిచెత్త -పొడిచెత్తల ద్వారా తయారయ్యే సేంద్రియ ఎరువు తయారీని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బందితో పాటు టిడిపి, జనసేన నాయకులు ఆర్వీ బాలాజీ, సుబ్రహ్మణ్యం గౌడ్, కుట్టి, గిరిబాబు, నాగరాజు, ఖాజా, క్రిష్ణ మూర్తి, కిరణ్, మదన్, శ్రీధర్, చాంద్ బాషా మరియు జనసేన నాయకులు దిలీప్, నాగరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

## సబ్ జైలును సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జ్ ఎమ్ఎస్ భారతి



శ్రీకాళహస్తి : పెన్ పవర్ ప్రతినిధి జూన్ 29 : హైకోర్టు మరియు ఆంధ్రప్రదేశ్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న అన్ని జైలును సందర్శించి, వచ్చేనెల జులై 5న తేదీ జరుగు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం విజయవంతం చేయాలని అవగాహన కల్పించుటకు ఈ సందర్భంగా సబ్ జైల్లో తులసి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి పట్టణంలోని సబ్ జైలును సందర్శించడం జరిగింది. జైలు రూమ్ లోని పరిశుభ్రత , వంటశాల, స్టోర్ రూమ్, బాత్రూంలను పరిశీలించారు. ప్రతి ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సబ్ జైల్ సుపర్డెంట్ శ్రీకాంత్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటరీలు పాల్గొన్నారు. న్యాయమూర్తి భారతి మాట్లాడుతూ... ప్రతి ఒక్క రిమాండ్ ఖైదీలకు తప్పక చట్టం పై అవగాహనా కలిగివుండాలి అన్నారు. అలాగే బెయిల్ గురించి మరియు ఉచిత న్యాయం, న్యాయ చట్టం...మొదలైన చట్టాలపై అవగాహనా కలిగి ఉండాలని తెలిపారు. మీ పరిసరప్రాంతాలు పరిశుభ్రముగా ఉండాలని తెలిపారు. మీకు ఏ సమస్యవున్న ఒక అర్జీ రూపంలో ఇచ్చినచో మీ సమస్య పరిష్కరించుటకు ప్రయత్నిస్తామని తెలిపారు. అలాగే రాబోవు జులై 5నతేది జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని కక్ష దారులకు, న్యాయవాదులకు తెలిపారు.

## తిరుపతిలోని శ్రీ శక్తి పీఠాన్ని సందర్శించిన టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు





**తిరుపతి పెన్ పవర్ జూన్ 29 :** తిరుపతి రాయల చెరువు రోడ్డులోని శ్రీ శక్తిపీఠం శ్రీ పాతాళ శ్వేత వారాహీ క్షేత్రంలో శ్రీ వారాహీ నవరాత్రులు సందర్భముగా శ్రీశ్రీశ్రీ అమ్మవారిని టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం శ్రీ మరకత శక్తి కాళీదేవి, శ్రీ మరకత సిద్దేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీ శక్తి పీఠాదేశ్వరీ మాతాజీ శ్రీశ్రీశ్రీ రమ్యానంద భారతి స్వామిని మర్యాద పూర్వకంగా చైర్మన్ కలుసుకున్నారు. ఈ సందర్భంగా టిటిడి చైర్మన్ మాట్లాడుతూ, శ్రీ శక్తి పీఠాన్ని సందర్శించి స్వామి వారు, మాతాజీ వారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. శ్రీ శక్తి పీఠంలో చాలా మంచి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఈ పీఠంలో పూజా కైంకర్యాలు, అన్నదానం చాలా బాగా చేస్తున్నారని చెప్పారు. ఈ పీఠాన్ని సందర్శిస్తే కష్టాలు తీరుతాయనే విశ్వాసంతో భక్తులు చాలా మంది వస్తున్నారని చైర్మన్ చెప్పారు. ప్రస్తుతం టిటిడి చాలా మంచి కార్యక్రమాలు చేపడుతున్నట్లు శ్రీ శక్తి పీఠం నిర్వాహకులు అభినందించారని తెలిపారు. ముందుగా టిటిడి చైర్మన్ శ్రీ శక్తి పీఠం చేరుకోగానే నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం టిటిడి చైర్మన్ ను సత్కరించి వైదేహి మాలను సమర్పించారు. శ్రీ శక్తి పీఠం తరుపున పుస్తక ప్రసాదాన్ని చైర్మన్ కు అందించారు. అనంతరం స్వామి, అమ్మవారిని టిటిడి చైర్మన్ శాలువాతో సత్కరించి శ్రీవారి ప్రసాదాలను అందించారు.

## బద్వేలులో పిచ్చి కుక్కల స్వైర విహారం...



**బద్వేలు పెన్ పవర్ జూన్ 29 :** అబ్బరాతివీధిలో ఓ చిన్నారిపై పిచ్చి కుక్క దాడి చేయడంతో ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుక్కలతో ఇబ్బందులు పడుతున్నామంటూ మున్సిపాలిటీ సిబ్బందిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


## ఘనంగా వాకర్స్ ఇంటర్నేషనల్ కౌన్సిల్ మీట్

### - సెప్టెంబర్ 28న పార్వతీపురంలో సదస్సు - సభ్యత్వం, కొత్త క్లబ్బుల ఏర్పాటుకు కృషి




**తిరుపతి/పెన్ పవర్/జూన్ 29 :** వాకర్స్ ఇంటర్నేషనల్ 163వ కౌన్సిల్ మీట్ ఆదివారం తిరు పతిలో ఘనంగా జరిగింది. వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ప్రభావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. సభ్యత్వం నూతనంగా క్లబ్బుల ఏర్పా టుకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. వాకర్ ఇంటర్నే షనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్స్, ఎలక్ట్ గవర్నర్స్ ఈ కార్యక్ర మంలో హాజరై ప్రసంగించారు. ఎలెక్ట్ గవర్నర్ డాక్టర్ పాతపాటి రవిరాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇంటర్నేషనల్ స్థాయిలో కౌన్సిల్ మీట్‌ను సెప్టెంబర్ నెల 28వ తేదీ ఆదివారం పార్వతీపురంలో నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. 163వ కౌన్సిల్ మీట్ పవిత్ర పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక కేంద్రం తిరుపతిలో జరగడం అభినందనీయమన్నారు. డాక్టర్ రవి రాజు తరువాయి 4లో..

## ఎస్వీ విద్యాదాన ట్రస్టుకు రూ.51 లక్షలు విరాళం



**తిరుమల పెన్ పవర్ జూన్ 29 :** చెన్నైకు చెందిన టీవీఎస్ క్యాపిటల్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ టీటీడీ శ్రీ వేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు రూ.51 లక్షలు విరాళంగా అందించింది. ఈ విరాళం చెక్కును సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ గోపాల్ శ్రీనివాసన్ శనివారం సాయంత్రం తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో శ్రీ సీ. హెచ్. వెంకయ్య చౌదరికి ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

## తాగునీటి సమస్య తీర్చేందుకు జల్ జీవన్ మిషన్ కింద రూ. 21 కోట్ల రూపాయల నిధులు : మంత్రి పయ్యావుల కేశవ్





**అనంతపురం, పెన్ పవర్ జూన్ 29 :** ఎన్నో ఏళ్లుగా ఉరవకొండ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య తీర్చడంపై రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. దీంతో అతి త్వరలో ఉరవకొండ పట్టణ ప్రజల తాగునీటి కష్టాలు తీరనున్నాయి. గతేడాది జూన్ నెలలో ఉరవకొండ నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొంది.. రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులుగా పయ్యావుల కేశవ్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఉరవకొండ నియోజకవర్గ ప్రజల తాగునీటి కష్టాలు తీర్చడంపై దృష్టి సారించారు. ఉరవకొండ ప్రాంత ప్రజల తాగునీటి సమస్యపై పూర్తి స్పష్టత ఉన్న మంత్రి పయ్యావుల కేశవ్ ఆర్. డబ్ల్యు. ఎస్, ఇతర శాఖల అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించి సమస్య పరిష్కారానికి అవసరమైన నిధులు తీసుకురావడానికి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఉరవకొండ పట్టణ ప్రజల తాగునీటి సమస్యపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి జల్ జీవన్ మిషన్ పథకం కింద 21 కోట్ల రూపాయలను ఉరవకొండ తాగునీటి సమస్య తీర్చేందుకు మంత్రి మంజూరు చేయించారు. ఆ నిధులతో పీఏబీఆర్ డ్యాం నుంచి ఉరవకొండ పట్టణానికి తాగునీరు తీసుకువచ్చేందుకు వీలుగా ఉదిరిపికొండ నుంచి ఉరవకొండ పట్టణానికి తాగునీటి పైప్ లైన్ పనులు చేపట్టారు. ఇప్పటికే ఉదిరిపికొండ నుంచి ఉరవకొండ పట్టణానికి చేపట్టిన పైప్ లైన్ పనులు పూర్తి చేయడం జరిగింది. అలాగే ఉరవకొండ మండలం బూదిగవి, వెలిగొండ గ్రామాల వద్ద ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టడం జరుగుతోండగా, వాటి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మిగిలిన చోట్ల సోమవారం నుంచి ఓవర్ హెడ్ ట్యాంక్ ల నిర్మాణం మొదలు పెట్టనున్నారు. వీటితోపాటు ఆయా పక్కన ఉన్న గ్రామాల్లో పలు స్ట్రక్చర్ లు, ఇతర పైప్ లైన్ పనులు కూడా పూర్తికావస్తున్నాయి. త్వరలోనే వాటి పనులు కూడా పూర్తి చేయనున్నారు. ఉరవకొండ పట్టణంలో కూడా ఇప్పటికే 400 కెహెచ్ కెపాసిటీ గల ట్యాంక్ నిర్మాణం పూర్తి చేయడం జరిగింది. అతి త్వరలో ఉరవకొండ పట్టణానికి తాగునీరు అందించే కార్యక్రమాన్ని వేగవంతంగా చేపడుతున్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర ప్రభుత్వంలో కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నా కూడా ఉరవకొండ నియోజకవర్గ ప్రజల తాగునీటి కష్టాలు తీర్చడంపై అనునిత్యం మానిటర్ చేస్తున్నారు. ఆర్. డబ్ల్యు. ఎస్, పబ్లిక్ హెల్త్, ఇతర శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ తాగునీటి పథకం పైపులైన్ పనులు శరవేగంగా జరిగేలా ఆదేశాలు ఇస్తూ పనులు పూర్తయ్యేలా మంత్రి దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో ఆర్. డబ్ల్యు. ఎస్ అధికారులు కూడా మంత్రి ఆదేశానుసారం జల్ జీవన్ మిషన్ పనులు పూర్తి చేస్తున్నారు. దీంతో ఉరవకొండ పట్టణ ప్రజలకు తాగునీరు పూర్తిస్థాయిలో అందనుంది.

## నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు

### కమిషన్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు



**శ్రీకాళహస్తి :పెన్ పవర్ ప్రతినిధి జూన్ 29 :** శ్రీకాళహస్తి పట్టణంలోనీ బలరాం దియేటర్ వద్ద ఉన్న కూల్ డ్రింక్ షాపు లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. మద్యం ప్రియలకు ఎప్పుడూ కావాలన్న మద్యం అందుబాటులో ఉంటుంది. ప్రతి బాటిల్ పై ఎమ్మార్పీ కన్నా రూ.50 నుండి వంద రూపాయలు అదనంగా తీసుకుంటున్నారని మద్యం ప్రియులు బాహటంగానే చెబుతున్నారు. ఈ కూల్ డ్రింక్ షాపు లో నిబంధనలను తుంగలో తొక్కి మరో బార్ లా మద్యం ప్రియులకు ఎనీ టైం ఆహ్వానం పలుకుతూ ఉంటుంది. తనిఖీలు చేయాల్సిన ఎక్సైజ్ అధికారులు ముడుపులు తీసుకుని మౌనంగా ఉంటున్నారని పట్టణ ప్రజలు ఎక్సైజ్ అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్ శాఖలోని కొంతమంది అవినీతి అధికారులు భారీగా ముడుపులు తీసుకొని చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారి వైపు ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో అంతరమ్యేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ బెల్ట్ షాపుకు కూత వేట దూరంలో ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ ఉంది. ఈ బెల్ట్ షాప్ లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు జరుగుతున్న కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తుంది. షాపులో ఈస్టారాజ్యంగా మద్యం అమ్మకాలు జరుగుతున్న అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో అధికారులపై పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. ఇక్కడ నిత్యం మందుబాబులు ఘర్షణలకు దిగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారనీ స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు ఈ బెల్టు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలనీ పట్టణ ప్రజలు కోరుతున్నారు.



# సిపిఓ కార్యాలయంలో ఘనంగా 19వ గణాంక దినోత్సవ వేడుకలు



**అనంతపురం, పెన్ పవర్ జూన్ 29 :** అనంతపురం నగరంలోని సిపిఓ కార్యాలయంలో 19వ గణాంక దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భారత గణాంకాల పితామహుడు, 1వ ప్రణాళికా సంఘం సభ్యుడు, భారత గణాంక సంస్థ వ్యవస్థాపకుడు పిసి.మహల్చంద్ర నోబిస్ జయంతి సందర్భంగా గణాంక దినోత్సవ వేడుకలను నిర్వహించగా, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సిపిఓ అశోక్ కుమార్, ఎస్ఓ మనోహర్, డిప్యూటీ ఎస్ఓలు సేనా నాయక్, పోతిరెడ్డి, తదితరులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఓ అశోక్ కుమార్ మాట్లాడుతూ భారత గణాంక సంస్థ వ్యవస్థాపకుడు పిసి.మహల్చంద్ర నోబిస్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి**



**అనంతపురం, పెన్ పవర్ జూన్ 29 :** ఈనెల 30వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. అలాగే అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో) కి నేరుగా కాల్ చేయవచ్చని సూచించారు.

# సమాజ హితం కోసమే సాహిత్యం

**- వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్**




**పలమనేరు జూన్ 29, (పెన్ పవర్) :** రాయలసీమ సాహిత్యంలో అద్భుతమైన కవి కథకుడు సి.వేణు అని, ఆయన సాహిత్యం సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ మధురాంతకం నరేంద్ర అన్నారు.ఆదివారం పట్టణంలో లయన్స్ క్లబ్ సర్వీస్ సెంటర్ నందు సాహిత్య సభ జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవ్విన ధాన్యరాశి కథల ద్వారా,మల్లెలు తూర్పు ఎత్తిన వేళ కవిత్వం ద్వారా అద్భుతమైన సాహిత్యాన్ని తెలుగులోకానికి అందించిన గొప్ప రచయిత సి.వేణు అని ఆయన అన్నారు. చిత్తూరు జిల్లా గుడిపాల మండలం మంది కృష్ణాపురం గ్రామంలో జన్మించిన సి.వేణు ఉత్తమ సమాజ నిర్మాణం కోసం ఉత్తేజ కరమైన రచనలు చేశారని,నేటితరం ఆయన రచనలను చదవాల్సిన అవసరం ఉందని అన్నారు. పాలపిట్ట మాసపత్రిక వెలువరించిన ప్రత్యేక సంచికను ఆయన ఆవిష్కరించారు. సాహిత్య వ్యక్తిత్వం గురించి స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని మధురాంతకం నరేంద్ర నిర్వహించి ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో స్వచ్ఛత ప్రచురణల పక్షాన సి.భానుమూర్తిరెడ్డి, చిత్తూరు జిల్లా రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి,రచయిత పలమనేరు బాలాజీ, ఆకాశవాణి రిటైర్డ్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ ఆకుల మల్లేశ్వరరావు, ప్రముఖ రచయిత్రి ఎంఆర్ అరుణకుమారి తదితరులు మాట్లాడారు.

# అభి ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాథ వృత్తురాలికి అంత్యక్రియలు




**ఎర్రగుంట్ల పెన్ పవర్ జూన్ 29 :** అభి ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధురాలికి అంత్యక్రియలు నిర్వహించారు. ఎర్రగుంట్ల మండలం, తిప్పలూరు గ్రామంలో ఎద్దుల పెద్ద శేషమ్మ వృద్ధాశ్రమంలో నంద్యాల జిల్లా, చాపరాల గ్రామానికి చెందిన వెంకటమ్మ (57) అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయాన్ని ఆశ్రమం నిర్వాహకుడు నాగేంద్ర అభి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కు డాక్టర్ ఎన్.విజయ బాబుకు విషయం తెలుపగా అక్కడికి వెళ్లి సాంప్రదాయ పద్ధతిలో అంతక్రియలు నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎన్ విజయ్ బాబు, నాగేంద్ర ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాధలను అభాగ్యులను ఆదరించడం అన్నం పెట్టడం మరియు అంత్యక్రియలు చేయటం మహా పుణ్యకార్యం అన్నారు, అలాగే ఎవరు లేకుండా మరణించిన వారికి మేమున్నామంటూ అనాధగా కాకుండా సంప్రదాయపద్ధంగా అంత్యక్రియలు నిర్వహిస్తున్నామని అన్నారు, ఎన్ని కష్టాలొచ్చినా ఎదుర్కొంటూ మానవత్వం కలిగిన మాకు దైవానుగ్రహంతోనే కార్యక్రమాలన్నీ ట్రస్ట్ ద్వారా చేస్తున్నామని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఎద్దుల ఆదిశేషయ్య సురేంద్ర, కన్నయ్య, ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# వేమన పద్యం ప్రాంతాలకు, భాషలకు అతీతమైంది

**తెలుగు భాషా సేవకులు స.వెం.రమేశ్**




**శ్రీకాళహస్తి, కడప పెన్ పవర్ జూన్ 29 :** వేమన నిజమైన ప్రజాకవి అని, అందువల్లనే ఆయన పద్యం కులాలను దాటి, మతాలను దాటి, ప్రాంతాలను దాటి, భాషలను దాటి విస్తరించిందని తెలుగు భాషా సేవకులు స.వెం.రమేశ్ (శ్రీకాళహస్తి) అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 144వ సదస్సు నిర్వహింపబడిరది. ఈ కార్యక్రమంలో 'సజీవ సంప్రదాయంగా వేమన' అనే అంశంపై తెలుగు భాషా సేవకులు స.వెం.రమేశ్ ప్రసంగించారు. ఆయన తన ప్రసంగంలో వేమన పద్యం ఏ భాషకూ లేనంత గొప్పతనాన్ని తెలుగు భాషకు కలిగించిందన్నారు. తమిళకవి తిరువళ్ళువర్‌తోనూ, కన్నడకవి సర్వజ్ఞునితోనూ వేమనను పోలుస్తుంటారని, సమాజంలో మంచిని పెంచి, చెడును తుంచే విషయంలో ఆ ముగ్గురికీ పోలిక ఉన్నమాట వాస్తవమే అయినప్పటికీ వీళ్ళకన్నా వేమనే గొప్పవాడని అన్నారు. తిరువళ్ళువర్‌ను తమిళ ప్రభుత్వాలు పట్టించుకొని ప్రచారం చేయడంవల్ల ఆయన రాసిన కురుళ్లు కొంత వాడుకలోకి వచ్చినప్పటికీ, చదువుకున్న తమిళ ప్రజల నాలుకలపైన మాత్రమే ఆయన నానుతున్నాడన్నారు.

అదేవిధంగా సర్వజ్ఞుడు కర్ణాటకలో కొంత సామాన్య జనంలోకి పోయినప్పటికీ ఆయన పరిధి కూడా చాలా పరిమితమని, వేమన అలా కాక కులాలను, మతాలను, ప్రాంతాలను, భాషలను దాటి దూసుకుపోయాడన్నారు. తెలుగువాళ్ళు బ్రతుకు పోరాటంలో ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళినప్పుడు వాళ్ళ నోళ్ళల్లో నానుతున్న వేమన పద్యాలు కూడా వాళ్ళతోపాటు వెళ్ళిపోయి తరాలు మారినప్పటికీ కాలానుగుణంగా వాళ్ళ సంప్రదాయాల్లో కూడా నిలిచిపోయాయన్నారు. వేమన వేసిన అడుగు చాలా పెద్దదని, నిచ్చెనమెట్ల కులసమాజంలో అట్టడుగున ఉన్న ఆశ్రిత కులాల గుండెల్లో కూడా గూడు కట్టుకోవడం ఆయన ప్రత్యేకత అన్నారు. వేమన తెలుగంటే ఏమిటో తెలియని, తెలుగు పేరైనా వినని కొన్ని జాతుల నాలుకలకు ప్రాణమైనాడన్నారు. మన రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా, తమిళనాడులోని తిరువళ్లూరు, కాంచీపురం, విళుపురం, కడలూరు జిల్లాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా ఆటపాటల్లో యానాదులనే గిరిజనులు వేమన పేరును ప్రస్తావించడం, ఆయన పద్యాలనుపాడి రైతులను పొగడడం, కావలసిన ధాన్యం ఇప్పించుకోవడం 2008 వరకు జరుగుతూ ఉండిరదన్నారు. కడలూరు జిల్లాలోని అంబలత్తాడియర్లు అనే ఆశ్రిత కులంవాళ్ళు తమిళుల్కెనప్పటికీ ధనుర్మాసంలో ఊరంతా తిరుగుతూ 'వేమనానంద పదిగం' అనే పేరుతో తెలుగులో వేమన పద్యాలను చెప్పడమే కాక, వేమనానందస్వామి తమ కులగురువని చెప్పుకుంటారన్నారు. పెరంబలూరు జిల్లాలోని కొంతమంది దళితులు శవయాత్రలప్పుడు పాడే పాటల్లో వేమన పద్యాలు పాడతారని, దిండుగల్లు జిల్లా తమిళ తెలుగువారి పెండ్లి సంప్రదాయాల్లో ఊరిపెద్ద 'అయ్యా ఆకాశవాణి, బూమాతదేవి, వేమన గురువులు సాచ్చిగా వక్కాకులు మార్చుకోండయ్యా' అని అంటారన్నారు.

కర్ణాటకలోని 'పాండవపుర' అనే పట్టణంలో రామాయణ యక్షగానాన్ని కన్నడంలోనే ప్రదర్శిస్తారని, అయితే తల్లిదండ్రులను పోషించే బాధ్యత కొడుకుదే అనే సందేశాన్ని ఇస్తూ అందులోని ఒక సన్నివేశంలో శ్రావణ కుమారుడు 'తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుండు' అనే వేమన పద్యాన్ని పాడి వినిపిస్తుంటాడన్నారు. బెంగుళూరు నగర శివారులోని కోనప్పన అగ్రహారంలో మహాయోగి వేమన ఆశ్రమం ఉందన్నారు. కేరళ దక్షిణ ప్రాంతంలో తామ్రపర్ణి నది దాటిన తర్వాత వచ్చే బాణతీర్థంలో కాణియర్లనే ఆదివాసులున్నారని, వాళ్ళ గురువులు చదివే దేవభాష మంత్రాల్లో వేమన పద్యాలున్నాయని, ఇలా వేమన పద్యాలు తమిళ, కన్నడ, మలయాళ ప్రాంతాల్లో కూడా వ్యాప్తిలో ఉన్నాయన్నారు. కార్యక్రమాన్ని డా? చింతకుంట శివారెడ్డి, డా? భూతపురి గోపాలకృష్ణశాస్త్రి సమన్వయం చేశారు. కార్యక్రమ ప్రారంభంలో వక్త స.వెం.రమేశ్‌ను యోగి వేమన విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు జి.శివారెడ్డి, పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా. చింతకుంట శివారెడ్డి, డా. భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది, పాఠకులు కలిసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఎన్.విజయానందరెడ్డి, డా.పెద్దిరెడ్డి నీలవేణి, డా.ఎస్.రాజగోపాలరెడ్డి, భూపతి రాయల్, రమేశ్, కొత్తపల్లె రామాంజనేయులు, సాయిబాబా, తేజ, మహేష్, దక్షిణామూర్తి, విజయకుమార్, శాంతారామ్, శ్యామసుందర్ రెడ్డి, రామమోహన్ రెడ్డి, పల్లె విజయ్, శ్రీనివాసులు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వివిధ సేవలపై భక్తుల నుండి టీటీడీ విస్తృత అభిప్రాయ సేకరణ



**తిరుపతి పెన్ పవర్ జూన్ 29 :** భక్తులకు అందిస్తున్న వివిధ సేవలను ఎప్పటికప్పుడు మరింత మెరుగుపరచడంలో భాగంగా గత కొంత కాలంగా టీటీడీ భక్తుల నుండి విలువైన అభిప్రాయాల్ని వివిధ రకాల ఫీడ్‌బ్యాక్ సర్వేల ద్వారా సేకరించడం ప్రారంభించింది. ఐవీఆర్ఎస్, వాట్సాప్ల ద్వారా ఈ సర్వే, శ్రీవారి సేవకుల ద్వారా మాన్యువల్ సార్వే లను ప్రారంభించి టీటీడీ భక్తుల నుండి అభిప్రాయాలు తీసుకుంటోంది.

**ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ సర్వే... :**

ఈ ఎలక్ట్రానిక్ సర్వే విధానం ద్వారా భక్తులు తిరుమల యాత్ర పూర్తి అనుభవం, అన్న ప్రసాదం, కళ్యాణ కట్ట, శ్రీవారి ఆలయం, వసతి, క్యూ లైన్ల నిర్వహణ మరియు లగేజ్ కౌంటర్ల పై మొత్తం 16 ప్రశ్నలపై తమ అభిప్రాయాలను వ్యక్తపరచవచ్చు.

**వాట్సాప్ ఫీడ్ బ్యాక్ విధానం... :**

తిరుమల, తిరుపతిలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌లను మొబైల్‌తో స్కాన్ చేస్తే (వాట్సాప్ నెం: 9399399399) టీటీడీ అభిప్రాయ సేకరణ పేజీ ఓపెన్ అవుతుంది. ఇక్కడ భక్తులు తమ పేరు, విభాగం (అన్నప్రసాదం, శుభ్రత, కల్యాణకట్ట, లడ్డూ ప్రసాదం, లగేజీ, దర్శన అనుభవం, క్యూలైన్, గదులు మొదలైనవి)ను ఎంచుకోవాలి.

**శ్రీవారి సేవకుల ద్వారా అభిప్రాయ సేకరణ :**

తిరుమల, తిరుపతిలోని వివిధ ప్రాంతాల్లో టీటీడీ భక్తులకు అందిస్తున్న సౌకర్యాలపై ప్రత్యక్షంగా అభిప్రాయ సేకరణ చేయడం జరుగుతోంది. ఈ విధానంలో సేవకులు టీటీడీ రూపొందించిన ప్రశ్నావళితో కూడిన అప్లికేషన్ ను తమ Mobile డౌన్లోడ్ చేసుకుని భక్తుల నుండి అభిప్రాయాలు సేకరిస్తారు. త్వరలోనే టీటీడీ మొబైల్ యాప్ మరియు టిటిడి బుకింగ్ పోర్టల్ నుండి భక్తులు యొక్క విలువైన సలహాలు సూచనలు తీసుకొనడానికి అప్లికేషన్ రూపొందించబడుతున్నది. భక్తుల అభిప్రాయాన్ని గౌరవిస్తూ, సేవలను మరింత మెరుగుపరచడం కోసం ఈ సర్వేల ద్వారా వారి ప్రత్యక్ష అనుభవాలను సేకరించడం జరుగుతోంది. ఈ విధానాల ద్వారా భక్తులు తమ అభిప్రాయాలను తెలియజేసి ఆన్ లైన్ సేవలను మెరుగుపరిచేందుకు తోడ్పడాల్సిందిగా టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.



# ఆగస్టు 9,10 తేదీలలో గిద్దలూరులో జరుగుతున్న జెవివి జిల్లా మహాసభలను జయప్రదం చేయండి!

**జెవివి రాష్ట్ర నాయకులు పి.స్వరూప రెడ్డి**



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 29 :** ఆగస్టు 9,10 తేదీలలో జనవిజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా 18వ మహాసభలు గిద్దలూరులో నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు పి.స్వరూప రెడ్డి తెలిపారు. ఆదివారం గిద్దలూరు లోని స్ప్రింగ్ బోర్డ్ హైస్కూల్లో జెవివి జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు మండ్లా శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గత 38 సంవత్సరాలుగా జన విజ్ఞాన వేదిక శాస్త్రీయ సమాజ ఏర్పాటు లక్ష్యంగా పని చేస్తున్నదని అన్నారు. మూఢ నమ్మకాలు నిరోధించేందుకు, ప్రజలలో సైన్సు,శాస్త్రీయ దృక్పథాన్ని వ్యాప్తి చేయడం ద్వారా సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న జెవివి జిల్లా మహాసభల విజయవంతం చేసేందుకు ఉద్యోగులు,ఉపాధ్యాయులు, విద్యావంతులు తగు సహాయ, సహకారాలు అందించాలనీ స్వరూప రెడ్డి కోరారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్.జయప్రకాశ్ మాట్లాడుతూ యుద్ధాలు వద్దనీ, ప్రపంచ శాంతి కోసం,పర్యావరణ పరిరక్షణ, సామాజిక న్యాయం, మానవ విలువలు, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందింప చేసేందుకు జెవివి కృషి చేస్తున్నదని అన్నారు. తెలుగు ప్రజలు హేతుబద్ధంగా ఆలోచించాలనీ, మెరుగైన జీవన ప్రమాణాలతో జీవించాలని గత 38 సంవత్సరాలుగా జనవిజ్ఞాన వేదిక అవిరళ కృషి జరుపుతున్నదని, రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అనేక మంది సైంటిస్టులు ,వైద్యులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విధ్యార్థులు, యువకులు, మహిళలు, మధ్యతరగతి మేధావులు, వృత్తి నిపుణులు దాదాపు 30 వేలకు పైగా సభ్యులున్న అతి పెద్ద సైన్స్ ప్రచార సంస్థ 'జనవిజ్ఞాన వేదిక' అని జయప్రకాష్ అన్నారు. ఈ మహాసభలలో జిల్లా సైన్స్ ఉద్యమాన్ని, నిర్మాణాన్ని సమీక్షించుకుని, భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకోవడం జరుగుతుందనీ జయప్రకాష్ తెలిపారు. జెవివి ఉపాధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్,యు.వెంకట్రావులు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల్లో తార్కిక ఆలోచన రేకెత్తించేందుకు, పిల్లల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు.. అవగాహన తరగతులు, చెకుముకి సైన్స్ సంబరాలు, సమ్మర్ క్యాంపులు, చెకుముకి సైన్స్ మాసపత్రిక ద్వారా గత నాలుగు దశాబ్దాలుగా జనవిజ్ఞాన వేదిక నిర్మాణాత్మక కృషి చేస్తోందని అన్నారు. అనంతరం ఈ సమావేశంలో జెవివి జిల్లా మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెడ్.రమణయ్య, ఏ.విశ్వరూపం, ఎస్.ఎం.డి రఫీ,జి.శ్రీనివాసరెడ్డి, జె.శేఖర్, డి.బాలు నాయక్, గిద్దలూరు డివిజన్ మండలాల నాయకులు ఎ.మల్లికార్జున రావు,యం.తిరుపతిరెడ ఎ.అల్లూరయ్య, వి.శ్రీనివాసులు,గోపాల్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వేట వదలని పెద్దపులి

**వరుసగా ఆవులమందపై దాడులు మూడు ఆవులు మృత్యు వాత**
**భయం భయంతో బిక్కు బిక్కుమంటున్న గిరిజనులు**




**ఆర్‌సి ఇంచార్జి యర్రగొండపాలెం పెనపవర్ జూన్ 29 :** మండలం లోని నల్లమల అటవీ ప్రాంతంలోగల పాలుట్ల సమీప ప్రాంతంలో పెద్దపులి ఆవులమందలపై వరుసదాడులు చేస్తూ తన వేట కొనసాగిస్తూనేవుంది. నల్లమలలోని దట్టమైన లోతట్టు అటవీప్రాంతంలో సంచరించే పెద్దపులి, గత వారం రోజులనుండి పాలుట్ల గిరిజన గూడెం దగ్గరకు వచ్చి ఆవులను చంపుతుండటంతో, ఎప్పుడు ఏ సమయంలో మనుషుల ప్రాణాలు తీసుకుంటుందోనని ప్రజలు భయం భయంతో బిక్కు బిక్కుమంటున్నారు. గత నాలుగు రోజుల క్రితం ఓ ఆవులమందపై దాడి చేయగా ఆవులు, రైతులు కేకలు వేయడంతో పులి అడవిలోకి పారిపోయింది.శనివారం రాత్రి మరల పాలుట్లలోని నానిక్ నాయక్ అనే రైతుకు చెందిన ఆవులమందపై దాడి చేసి రెండు ఆవులను చంపి వేసిందని, దీంతోరెండు లక్షలు ఆర్థిక నష్టం జరిగిందని రైతు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు.కొన్నిరోజులనుండి పులి సంచారం భయాందోళన కలిగిస్తుందని, ప్రజలను, పశువులను పులి బారినుండి కాపాడాలని అటవీశాఖ అధికారులను వేడుకుంటున్నారు.

**చర్యలు తీసుకుంటాం :** పాలుట్ల అటవీప్రాంత సమీపంలో ఆవులను చంపిన సంఘటనపై విచారణ చేపట్టమని, సి సి కెమెరాలను పరిశీలించగా పెద్దపులిగా నిర్ధారించామని, పులి గ్రామాలలోకి రాకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలన్న విషయం పై దృష్టి సారించమని అటవీశాఖ అధికారులు తెలిపారు.

# పొదిలిలో మంకీ బాత్‌ను వీక్షించిన బిజెపి నాయకురాలు విజయలక్ష్మి




**పొదిలి, పెన్ పవర్, జూన్ 29 :** పొదిలిలో భారత ప్రధాని నరేంద్ర మోడీ మంకీ బాత్ కార్యక్రమాన్ని బిజెపి నాయకురాలు బెల్లంకొండ విజయలక్ష్మి వీక్షించారు ఆదివారం నాడు పట్టణంలోని బెల్లంకొండ నగర్ లో గల మండల బిజెపి కార్యాలయంలో ఆమె నరేంద్ర మోడీ నిర్వహించిన మంకీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ భారతదేశ అన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ ఆశలు ఆశయాలు అందరికీ ఆచరణీయమన్నారు నరేంద్ర మోడీ లాంటి మహోన్నత వ్యక్తి నాయకత్వంలో భారతదేశం ప్రపంచ పటంలో వెలిగిపోతుందని ఆమె ఉద్ఘాటించారు ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు దోర్నాల రమణారెడ్డి, పట్టణ బిజెపి అధ్యక్షులు యుద్ధ మహేష్ తో పాటు బిజెపి కార్యకర్తలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మోడీ కార్మిక వ్యతిరేక విధానాలపై సమ్మె

**దొనకొండలో సిఐటియు ప్రచార సామాగ్రి ఆవిష్కరణ**



దొనకొండ జూన్ 29 పెన్ పవర్ : మండల కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మిక, రైతు, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జులై 9న దేశవ్యాప్త సమ్మె చేస్తున్నట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తాండవ రంగారావు తెలిపారు. ఈరోజు దొనకొండ యుటిఎఫ్ భవనంలో సమ్మె ప్రచార సామాగ్రిని ఆవిష్కరించి మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన 11 సంవత్సరాల లో దేశంలో అసమానతలు బాగా పెరిగాయని కార్పొరేట్ సంపద రెట్టింపు అయిందని. కార్మికులు,రైతులు, ఉద్యోగులు, కూలీలు, నిత్యవసర సరుకుల ధరల పెరుగుదలతో అప్పుల పాలవుతున్నారని విమర్శించారు. ప్రైవేటీకరణ విధానాల వల్ల ప్రజలకు ఉపాధి లేకుండా పోతుందని ప్రజల ఆస్తులను కారు చవుకగా మోడీ ప్రభుత్వం అమ్ముతున్నారని తెలిపారు. కనీస వేతనాల చట్టం, ఎనిమిది గంటల పని విధానము, సమ్మె హక్కు, పిఎఫ్, పారిశ్రామిక వివాదాల చట్టము, తదితర హక్కులు కార్మికులు పోరాడి సాధించుకున్నారని ఆ హక్కులను మోడీ ప్రభుత్వం రద్దుచేసి కార్మికులకు అన్యాయం చేస్తున్నాదని.దీనికి తెలుగుదేశం, వైసిపి, జనసేన పార్టీలు వైసీపీ జనసేన పార్టీలు వంత పాడుతున్నాయని విమర్శించారు. ఈ మోడీ ప్రజా వ్యతిరేక విధానాల పై జులై 9న జరిగే సమ్మెలో అంగన్వాడి, ఆశ, మధ్యాహ్న భోజనం, సివిల్ సప్లై ముఠా, పంచాయితీ, వి ఏ ఓ, ఆటో, బిల్డింగ్ కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్స్, ఎల్ఐసి, పోస్టల్, టెలికాము, బ్యాంకు ఉద్యోగులు, తదితర కార్మిక ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయుటకు దొనకొండ మండలంలో కరపత్రాలు, పోస్టర్స్, స్టిక్కర్స్, బుక్ లైట్స్, జనరల్ బాడీ సమావేశాలు, గ్రూప్ మీటింగ్స్,. ప్రచారం సిఐటియు చేస్తున్నదని వారు తెలిపారు. ఈ ఆవిష్కరణలో దొనకొండ మండల సిఐటియు కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, కుందుర్తి చిన్న నరసింహులు, కర్ణ హనుమయ్య, కోలా కిరణ్ కుమార్, కర్ణ వెంకటకృష్ణ, కొమరగిరి శ్రీను, మేళం సంతోష్ కుమార్, చిరుపల్లి నాగార్జున, కొండా ఏసుదాసు, తదితరులు పాల్గొన్నారు.

## మహా టీవీ కార్యాలయం పై దాడిని ..
## ఖండించిన ధర్మవరం ఏపీడబ్ల్యూజేఎఫ్ డివిజన్ కమిటీ



**ధర్మవరం పెన్ పవర్ జూన్ 29 :** ప్రజాస్వామ్యంలో జరుగుతున్న అన్యాయాలని వెలికితీస్తున్న మీడియాపై దాడులు చేయడం హేయమైన చర్యని ధర్మవరం ఏపీడబ్ల్యూజేఎఫ్ డివిజన్ కమిటీ అధ్యక్షులు మురళి గౌడ్, ప్రధాన కార్యదర్శి పతకమూరి నాగభూషణం, గౌరవ అధ్యక్షుడు భాస్కర్ గౌడ్, కోశాధికారి భీమనేని వెంకటేశ్వర చౌదరి, పట్టణ అధ్యక్షుడు భాస్కర్, పట్టణ కోశాధికారి ప్రసాద్ రెడ్డిలు త్రీవరంగా ఖండించారు. ఇటీవల హైదరాబాద్ మహా టీవీ కార్యాలయం పై దాడి చేయడం సరైన పద్ధతి కాదన్నారు. జర్నలిస్టులపై దాడి పత్రిక స్వేచ్ఛకు విఘాతం కలిగించడమేనని ఆ యూనియన్ ప్రతినిధులు పేర్కొన్నారు. దీనికి ఒడిగట్టిన బాధ్యులపై చర్యలు తీసుకోవడమే కాక కుట్ర కోణాన్ని ఛేదించాలని డిమాండ్ చేశారు. జరిగిన సంఘటనపై తెలంగాణ ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిజాలను వెలికితీస్తే ఇలాంటి దాడులు చేయడం దారుణం అన్నారు. ఇటీవల రాజకీయ పార్టీలు సంఘవిద్రోహ శక్తులు మీడియాపై దాడికి ప్రయత్నిస్తున్నాయని వీటిని ఎట్టి పరిస్థితుల్లో జర్నలిస్టు సంఘాలు అంగీకరించమని అన్నారు. ఇలాగే దాడులు చేస్తే తమ కలం తోనే సమాధానం చెప్పాల్సి ఉంటుందని ఏపీడబ్ల్యూజేఎఫ్ డివిజన్ ధర్మవరం.

### తులసి నాయని పల్లి గ్రామం మోడల్ స్కూల్, దగ్గర ముఖ్యమంత్రి బహిరంగ సభలో పాల్గొంటారు : జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు పెన్ పవర్ జూన్ 29 :** ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఆయన పాల్గొనే కార్యక్రమాలు నిర్వహించనున్న ప్రదేశాలను ముందస్తు పర్యటన ఏర్పాట్లలో భాగంగా ఆదివారం కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్ ఏర్పాట్లు పనులను పరిశీలించారు. తుమ్మిశి పంచాయతీ డుంకు మానిపల్లెవద్ద హెలిప్యాడ్ ప్రాంతానికి వెళ్లి అక్కడ చేయాల్సిన ఏర్పాట్ల గురించి అధికారులకు సూచనలుచేశారు. అనంతరం తిమ్మరాజుపల్లె చేరుకుని, స్థానికులతోను, టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. బహిరంగ సభ ఏర్పాట్ల గురించి చర్చించారు. కుప్పం మండల సచివాలయంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి పర్య టన నేపథ్యంలో వారివారి శాఖల పరిధిలో జరుగున్న అభివృద్ధి పనులపై సమగ్ర డీపీఆర్ తయారు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. రేపటి రోజు ముఖ్యమంత్రి పర్యటన సంబంధించిన కార్యక్రమాలపై అధికారికంగా ప్రకటన విడుదల కానున్నది.

## పార్టీ కార్యాలయంలో మన్‌కి బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కోలా ఆనంద్



**శ్రీకాళహస్తి : పెన్ పవర్ ప్రతినిధి జూన్ 29 :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అసెంబ్లీ కన్వీనర్ కోలా ఆనంద్ బీజేపీ పార్టీ కార్యాలయంలో నరేంద్ర మోదీ మనసులోని మాట ( మన్ కి బాత్) కార్యక్రమాన్ని కార్యకర్తలుతో వీక్షించడం జరిగింది. నరేంద్ర మోదీ గారు దేశ ప్రధాన మంత్రి అయిన నుంచి 2014 అక్టోబరు 3వ తారీఖు నుంచి ఇప్పటికీ 123 ఎపిసోడ్ మన్ కి బాత్ కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని కోలా ఆనంద్ తెలిపారు. ఈ రోజు నరేంద్ర మోదీ మన్ కి బాత్ లో అంతర్జాతీయ యోగా దినోత్సవంపై మోదీ ప్రశంసలు వెల్లడించారు. దేశ విదేశాల్లో యోగాను అద్భుతంగా నిర్వహించరాని ప్రత్యేకంగా వైజాగ్ లో 3 లక్షల మందితో బ్రహ్మండంగా జరిపారని మోదీ మన్ కీ బాత్ లో కితాబిచ్చారని కోలా ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, అసెంబ్లీ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్ తో పాటు జిల్లా కార్యదర్శి, అసెంబ్లీ పార్టీ కో - కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, తొట్టంబేడు మండలం అధ్యక్షులు వేడం కృష్ణయ్య, పట్టణ యువమోర్చా అధ్యక్షులు తానికొండ్ల భరత్ నాయుడు, పుణ్యం డిల్లీ రెడ్డి, నానీ, డిల్లీ బాబు తదితరులు పాల్గొన్నారు.

## కాప్స్-రాక్స్‌పై మండల గ్రామ స్థాయిలో ఆత్మీయ సమావేశం

### పగడాల శివ ప్రదీప్ ఆధ్వర్యంలో క్యాప్స్-రాక్స్ ప్రోగ్రాం ఏర్పాటు



**నాయుడుపేట, పెన్ పవర్ ప్రతినిధి, జూన్ 29 :** తిరుపతి జిల్లాలోని క్యాప్స్ అండ్ రాక్స్ పై పగడాల శివ ప్రదీప్ ఎం.ఏ ఆధ్వర్యంలో నాయుడుపేట పట్టణంలోని తన నివాసం వద్ద బలిజ సంగం మీటింగ్ ఏర్పాటు చేసి క్యాప్స్ అండ్ రాక్స్ గ్రూప్ ద్వారా జరిగే సహాయ సహకారాలు తెలియచెయడం జరిగింది..ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కాప్స్ రాక్స్ ముఖ్య ఉద్దేశం గురించి తెలియజేస్తూ ఎడ్యుకేషన్,జాబ్స్, డాక్టర్స్,బ్యాంకింగ్,బ్లడ్ డొనేషన్, మాట్రిమోనీ, పోలీస్, బిసినెస్ వాటిపై అవగాహనా కల్పించారు.. ఈ కార్యక్రమంలో తిరుపతి హెడ్ క్డోనేటరోస్ హేము కుమార్, ఆదిత్య,చలం,నాయుడుపేట సూళ్లూరు పేట బలిజ సంగం ప్రెసిడెంట్ పగడాల శివ ప్రదీప్,సహాయ కార్యదర్శి హంస పృథ్వీ చంద్,హంస రామారావు,కోప్పల సుబ్రమణ్యం,గడదాసు వెంకటేశ్వర్లు,సుబ్బారావు, నీలం హరికృష్ణ,వక్కలకుల సుబ్రమణ్యం,ఒంటరి లోకేష్,కిరణ్, భాస్కర్, సాయిహేమంత్, హరి, శరత్, సాధు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు కంటి వెలుగును ప్రసాదించడంలోనే నిజమైన సంతృప్తి ఉంది

### లయన్స్ క్లబ్ అధ్యక్షులు వేణుగోపాలాచార్యులు, కార్యదర్శి ఆకులేటి రమేష్ బాబు





**ధర్మవరం పెన్ పవర్ జూన్ 29 :** పేద ప్రజలకు కంటి వెలుగును ప్రసాదించడంలోనే నిజమైన సంతృప్తి ఉంది అని లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాలచార్యులు ఆకులేటి రమేష్ బాబు కోశాధికారి ఉలవల నాగేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో (వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా) లయన్స్ క్లబ్ వారిచే ఉచిత కంటి చికిత్స శిబిరమును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ రామకృష్ణ, సభ నిర్వహణగా లయన్స్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకులు వెంకట స్వామి హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ నేటి ఈ శిబిరానికి దాతలుగా కీర్తిశేషులు చెన్నంశెట్టి లక్ష్మీదేవి, చెన్నం శెట్టి నాగభూషణం జ్ఞాపకార్థం కుమారుడు చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్ వారి కుటుంబ సభ్యులు వ్యవహరించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. లయన్స్ క్లబ్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు వేల సంఖ్యలో కంటి ఆపరేషన్లతో పాటు, ఉచితంగా అద్దాలు కూడా ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం ధర్మవరంలో ఎర్రగుంటలో లయన్స్ కంటి ఆసుపత్రి కార్యాలయం ప్రతిరోజు వివిధ సేవా కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. పేద ప్రజల కంటి వెలుగు అభివృద్ధి మా లక్ష్యము అని వారు స్పష్టం చేశారు. ఈ శిబిరంలో 42 మంది కంటి రోగులు పాల్గొనగా 26 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. కంటి టెక్నీషియన్ నాగేంద్ర ద్వారా కంటి వైద్య చికిత్సలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పళ్లెం వేణుగోపాల్, రాజగోపాల్ ,గోశే రాధాకృష్ణ, చందా నాగరాజు, ఆర్.జి.వెంకటేష్, ఉట్టి ప్రసాద్, రాజీవ్ నేత, గిరక ప్రియాంక, పుట్లూరు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన ప్రధానోపాధ్యాయులకు ఘన సన్మానం





**నాయుడుపేట, పెన్ పవర్ ప్రతినిధి, జూన్ 29 :** గెజిటెడ్ హెడ్మాస్టర్ గ్రేడ్-2గా పదోన్నతి పొందిన జె.వెంకట్రావు,కె. సుబ్బరామయ్య లను బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం నాయుడుపేట పట్టణంలోని ఉద్యోగుల విశ్రాంత భవనంలో గెజిటెడ్ హెడ్మాస్టర్ గ్రేడ్ 2 గా పదోన్నతి పొందిన జె.వెంకట్రావు, కే సుబ్బరామయ్య లను బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి, పూలమాలలు వేసి, సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు పేర్నాటి వెంకటేశ్వర్లు, విశ్రాంత ఎంఈఓ నల్లమాకుల శ్రీనివాసులు, బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పల్లం వేణుగోపాల్ రాష్ట్ర ట్రెజరర్ పి.ఆదినారాయణ, తిరుపతి జిల్లా ఇంచార్జి లక్ష్మయ్య, బి టి ఏ రాష్ట్ర కార్యదర్శి మునస్వామి, ఎం. వెంకటశేషయ్య మరియు బి టి ఏ అదనపు కార్యదర్శి పేర్నాటి రామకృష్ణ పాల్గొన్నారు లక్ష్మీప్రసాద్ బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయుడుపేట మండల నాయకులు పి.చంద్రయ్య బి. బాబు చిట్టమూరు మండల నాయకులు జి. వెంకటేశ్వర్లు బి. సుధాకర్, వాకాడు మండల నాయకులు టీవీ రమణయ్య, మస్తానయ్య , దొరవారిసత్రం మండల నాయకులు టి.నాగరాజు, వినయ్ కుమార్ మరియు బాంసెఫ్ నాయకులు బి.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనారాయణస్వామికి అభిషేకోత్సవం, గోపూజ, మహా నైవేద్యం







**చంద్రశేఖరపురం, పెన్ పవర్ జూన్ 29 :** చంద్రశేఖరపురం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం శ్రీ నారాయణ స్వామి వారి దేవస్థానం నందు స్వామివారికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయము స్వామివారి అభిషేక విగ్రహానికి పంచామృత అభిషేకొత్సవం భక్తిశ్రద్ధలతో సాగింది ఈ సందర్భంగా ఆలయ పూజారులు స్వామికి అభిషేకాలు నిర్వహించారు అనంతరం స్వామివారి మూల విరాట్ మరియు శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో పూలమాలలతో అలంకరణ చేసి శ్రీ నారాయణ స్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహ బాబు, శ్రీ నారాయణ స్వామి దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ వేదమంత్రాలతో గోశాలలో గోపూజ కార్యక్రమం తదుపరి మహా నైవేద్యాంతో ఆలయ ఆవరణం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని మహా నైవేద్యంగా స్వామివారికి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తమ మొక్కులు తీర్చుకునేందుకు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా అర్చకులు భక్తులకు గోత్రనామాలతో ఆశీర్వదించి స్వామివారి పూజలు అందించిన అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు అనంతరం భక్తులకు ఏర్పాటుచేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో సోడా ఆదినారాయణ,భక్తులు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# అంతర్ రాష్ట్ర దోపిడి దొంగ అరెస్టు



**తిరుపతి/పెన్ పవర్/జూన్ 29 :** పగలుపూట రిక్కీ నిర్వహించడం తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ రాత్రిపూట దోపిడీ చేస్తారు. స్ బి ఐ కాలనీ, కాటన్ మిల్, ఆటోనగర్ సమీపంలో కాపురం ఉంటున్న ఫరూక్ 9వ తారీఖున తన కుటుంబంతో కలిసి తన ఇంటికి తాళం వేసి నెల్లూరులో ఉన్న దర్గాకు వెళ్లారు, అది గమనించిన కృష్ణప్ప రాజేష్ (23) తండ్రి పేరు లేట్ క్రిష్ణప్ప ఎలాగైనా రాత్రికి దోపిడీ చేయాలని నిర్ణయించుకొని ఎవరూ లేరు సమయంలో తాళం పగలగొట్టి ఇంటిలో ఉన్న బంగారం నగదు అంతే కాకుండా బయట వరండాలో పార్క్ చేసిన స్ప్లెండర్ ప్లస్ వెహికల్ ని తీసుకొని పారిపోయాడు. ఫరూక్ పదవ తేదీన నెల్లూరు నుంచి తిరిగి తన ఇంటికి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉంది అలాగే ఇంట్లో నగదు బంగారం మోటార్ వెహికల్ చోరీ అయినట్టు గమనించి తిరుపతి క్రైమ్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. సదరు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతి ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఐపీఎస్ వారి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ నాగభూషణరావు పర్యవేక్షణలో తిరుపతి సిసిఎస్ డిఎస్పి శ్యామ్ సుందరం, ఇన్స్పెక్టర్లు చిన్న పెద్దయ్య, యన్. శివ కుమార్ రెడ్డి, జి.ప్రకాష్ కుమార్, స్ఐ లు సుబాన్ నాయక్, సిసిఎస్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు, ఇందులో భాగంగా హరే రామ హరే కృష్ణ టెంపుల్ సమీపంలో ఎన్జీవో కాలనీ దగ్గర 29వ తేదీ ఉదయం 11 గంటలకు అనుమానం వచ్చి అరెస్ట్ చేసి విచారించగా ఈ దొంగతనానికి కారకుడు అతనిని నిర్ధారించుకొని అతని నుంచి దొంగతనం కాబడిన నగదు బంగారు మోటార్ సైకిల్ రికవరీ చేశాను.

ఈ సందర్భంగా డి.ఎస్.పి శ్యాంసుందర్,అడిషనల్ ఎస్పీ నాగభూషణరావు మీడియా వారితో మాట్లాడుతూ నేరస్థునికి ఉన్న చెడు అలవాట్లు వల్ల అతని విలాసలకు, చెడు అలవాట్లకు డబ్బులు అవసరము కాగా సులభంగా డబ్బులు సంపాదించాలని, అందుకు దొంగతనములు చేయాలని అర్ధ రాత్రి తాళం వేసిన ఇండ్లను ఎంపిక చేసుకుని, దొంగతనములు చేసినాడు. ఇతనిపై, చిత్తూర్, పిలేరు, చంద్రగిరి, తిరుమల 2 టౌన్, అలిపిరి, అన్నమయ్య జిల్లా మదనపల్లి టౌన్, మదనపల్లి రూరల్, పుంగనూరు, ముడివేడు,కడప జిల్లా కోడూర్, రాయచోటి, వేలూరు, తమిళ నాడు, వంటి చోట్ల నేరములు చేసి జైల్ కు వెళ్లినట్లు తెలిపారు.

## కలెక్టరేట్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్ జూన్ 29 :** ఈ నెల 30న సోమవారం ఉదయం 9-30 గంటలకు నంద్యాల జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తులను జిల్లా కలెక్టరేట్ కు వచ్చే అవసరం లేకుండా లో ఆన్లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చునని, దరఖాస్తు పరి ష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో ప్రస్తుత సమాచారం ఆన్లైన్లో తెలుస్తుం దని లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ను సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత మండల, డివిజన్, మున్సిపాలిటీలలో అధికారులకు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. మండల, డివిజన్ స్థాయిలలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు. ఉదయం 9.30 గంటలకు అధికారులందరూ తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎరుకల జీవన గాథలను వెలుగులోకి తెచ్చింది రచయిత పలమనేరు బాలాజీ నే!



**పలమనేరు జూన్ 29, (పెన్ పవర్) :** తెలుగు సాహిత్యంలో ఎరుకల జీవన గాథలను తొలిసారిగా వెలుగులోకి తీసుకువచ్చిన రచయిత పలమనేరు బాలాజీ అని, ప్రముఖ రచయిత అనువాదకులు వీక్షణం పత్రిక సంపాదకులు ఎన్ వేణుగోపాల్ అన్నారు.ఆదివారం పట్టణంలోని లయన్స్ క్లబ్ నందు జరిగిన సాహిత్యసభలో పలువురు రచయితలు మాట్లాడుతూ.. మానవ సంబంధాల గురించి కథలు కవిత్వం ద్వారా సమాజానికి మంచి రచనలు పలమనేరు బాలాజీ అందించారని ప్రముఖ రచయిత్రి వి.ప్రతిమ అన్నారు.ప్రపంచ సాహిత్యంలో ఆదివాసీలకు సంబంధించిన ముఖ్యమైన సాహిత్య చరిత్ర అందరూ అధ్యయనం చేయాల్సి ఉంటుందని, ఇదే క్రమంలో తెలుగు ఆదివాసి సమాజంలో ఎరుకల జీవితాలను వెలుగులోనికి తీసుకొని వచ్చి,ఎరుకల జీవితంలోని ఉద్వేగాలను కథలుగా పలమనేరు బాలాజీ మలచారని ప్రముఖ రచయిత సుంకోజి దేవేంద్రాచారి అన్నారు.పలమనేరు బాలాజీ ఎరుకల కథలు ఏకలవ్య కాలనీ, కవిత్వం లోపలేదో కదులుతున్నట్టు పుస్తకాలను సభకు ప్రముఖ రచయితలు కవులు పరిచయం చేశారు.ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు, ప్రముఖ రచయితలు మంచికంటి, టి.ఎస్.ఏ కృష్ణమూర్తి,కృష్ణస్వామి రాజు,కవితశ్రీ,ఎండపల్లి భారతి, పి.తులసీనాథం నాయుడు,జక్కన్న, తొండవాని గోపీనాథ్, పేట యుగంధర్, మురిశెట్టి గోవిందు, మేఘనాధ రెడ్డి,సీఎన్ చంద్రశేఖర్,వంగాల సంపత్ రెడ్డి, గిరిధరమూర్తి,యుగంధర్,షేక్ హసీనా బేగం, పత్తిపాటి రమేష్ నాయుడు,గండికోట వారిజ,సిహెచ్ నాగార్జున శర్మ,చంద్రశేఖరయ్య, దోర్నాదుల సిద్ధార్థ, సంధ్యా శర్మ,ఎర్రయ్య, మల్లెల నాగరాజు,పివి ప్రసాద్,బ్రహ్మనంద్, నవ్యాంధ్ర రచయితల సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షురాలు కరణం విమల,రెడ్ క్రాస్ అసోసియేషన్ నాయకులు ఎంఆర్ సహదేవ నాయుడు, రసజ్ఞుల సమాఖ్య శ్రీపురం సీతారామయ్య, ఎన్జీవో నాయకులు ఆనంద్,లక్ష్మీపతి,రైతు నాయకులు ఉమాపతి నాయుడు,తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో

## ఆయాలకు వేతనాలు పెంచాలి

### - సిఐటియు మండల కన్వీనర్ జేవి రమణ



**ధర్మవరం పెన్ పవర్ జూన్ 29 :** ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలుగా పనిచేస్తున్న వారికి వేతనాలు పెంచాలని సిఐటియు మండల కన్వీనర్ జేవి. రమణ తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆయాలతో సమావేశాన్ని నిర్వహించి అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు కేవలం నాలుగు వేల రూపాయల వేతనమిస్తూ వారితో ప్రభుత్వం వ్యక్తి చాకిరీ చేయించుకోవడం ఎంతవరకు సమంజసమని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు?. కనీస వేతనం అమలు చేయకుండా వారి కుటుంబాలు అనేక రకాల ఇబ్బందులు పడటానికి ప్రభుత్వం ప్రత్యక్షంగా కారణమవుతుందని వారు మండిపడ్డారు. కనీసం ఆయాలకు 10,000 వేతనం పెంచుతూ ప్రతినెల 5వ తారీఖు వారి ఖాతాలోకి జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చౌడమ్మ, జయమ్మ, ముంతాజ్ ,భాగ్యమ్మ, గంగమ్మ, నాగలక్ష్మి, పర్వీన, నజమ్మ తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలిబీబీ అధ్యక్షులు బొగ్గు నాగరాజ్:::: మున్సిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అధ్యక్షులు బొగ్గు నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా రిలే నిరసనలో భాగంగా వారు మాట్లాడుతూ కార్మికులకు 26 వేల రూపాయల వేతనం ఇస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నీ కూడా వర్తింపజేయాలని తెలిపారు. జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. పనిని బట్టి అలవెన్స్ కూడా వర్తింపజేయాలని, కార్మికుడు చనిపోతే ఏడు లక్షలు ఇవ్వాలని తెలిపారు. పదవి విరమణ పొందిన తర్వాత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని తెలిపారు. 60 నుంచి 62 ఏళ్లకు ఉద్యోగ పరిమితి పెంచాలని, దహన సంస్కారాలకు 15 నుంచి 25 వేల రూపాయల వరకు పెంచాలని వారు తెలిపారు. మా న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకపోతే జూలై 4వ తేదీన విజయవాడలో జరిగే బహిరంగ సభలో సమ్మెకు ఏ తేదీన పిలిస్తే ఆరోజు సమలోకి దిగుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కాటమయ్య, కార్యదర్శి బాబు, చంద్రశేఖర్ రెడ్డి, దస్తగిరి, రాంప్రసాద్, యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా యూత్ సెల్ డైరెక్టర్‌గా దావాల వర్ధన్ నియామకం



**శ్రీకాళహస్తి : పెన్ పవర్ ప్రతినిధి జూన్ 29 :** ఇంటర్ నేషనల్ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తిరుపతి జిల్లా యూత్ సెల్ డైరెక్టర్ గా శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన దావాల. వర్ధన్ నియమితులయ్యారు. శనివారం ఆ సంస్థ దక్షిణ భారత దేశ చైర్మన్ కుర్ర సూర్య నారాయణ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వర్ధన్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ పోలీస్& విజిలన్స్ డైరెక్టర్ పుల్లగూర అశోక్ కుమార్, ఏపీ స్టేట్ చైర్మన్ రామచంద్ర రెడ్డి, పాల్గొన్నారు. మరియు పలువురు అభినందనలు తెలిపారు.

## కార్మికుల హక్కుల కోసం సమ్మె



**దొనకొండ జూన్ 29 పెన్ పవర్ :** మండల కేంద్రంలో కార్మికుల హక్కుల కోసమే జూలై 9న సమ్మె జరుగుతుంద నీ సిఐటియు దొనకొండ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య అన్నారు. ఈరోజు దొనకొండ సివిల్ సప్లై సమ్మె నోటీసులు సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి. నాలుగు కోడ్ బిల్లులను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా తేవటం జరిగిందని ఆయన విమర్శించారు. అందులో భాగంగా 8 గంటల పని విధానాన్ని రద్దుచేసి 10 గంటలకు పెంచడము కార్మికులు ఈ పనిగంటలకు పెంపుకు వ్యతిరేకంగా సమ్మె చేస్తున్నారు అనితెలిపారు. ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని. మరణించిన వారికి పది లక్షలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని, ఈ ఎస్ ఐ పథకం అమలు చేయాలని అంజయ్య డిమాండ్ చేశారు. సివిల్ సప్లై ముఠా యూనియన్ నాయకులు గుడిమెట్ల ఆదాము, పోరుమామిళ్ల వెంకటేశ్వర్లు, ధారా నరసింహారావు, కోటేశ్వరరావు, మువ్వా వెంకట్ రాజు, సుంకేసుల గాలయ్య, సురగని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సత్య మాంబ దేవికి మహిళలు నైవేద్యాలు సమర్పణ



**బేస్తవారిపేట, పెన్ పవర్ జూన్ 29 :** ఆషాడ మాసం రెండవ ఆది వారం కావడంతో శ్రీ కోట సత్యమంబా దేవి ఆలయం భక్తులతో కోటా సత్య మంబాదేవిని ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం దర్శనం కల్పించారు. బేస్తవారిపేట మండలం గొట్లమిళ్ళ గ్రామంలో ఉన్న సత్యమంబాదేవి ఆలయానికి భక్తులు భారీగా చేరుకొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆషాడ మాసం రెండవ ఆదివారం కావడంతో మహిళలు ఆలయానికి భారీగా తరలివచ్చి అమ్మవారిని నైవేద్యాలు, బోనాలు సమర్పించారు. మొక్కుబడుతున్నటువంటి భక్తులు అమ్మవారికి కుంకుమ ఎద్దుల బండ్లు కట్టి మేళతాళలతో ఊరేగింపుగా వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు.దేవస్థాన కమిటీ సభ్యులు రమణస్వామి ఆధ్వర్యంలో శ్రీనివాసులు,వెంగళరావు ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కమిటీ ఆధ్వర్యంలో చర్యలు తీసుకొని అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆషాడంలో మొక్కుబడి ఉన్నటువంటి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని దర్శించుకునేందుకు కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు,గిద్దలూరు మండల ప్రజలతోపాటు మార్కాపురం మరియు నంద్యాల నుండి భారీగా భక్తులు తరలించారు.భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అరెస్టు



**కడప, పెన్ పవర్ జూన్ 29 :** పెద్దారెడ్డిని బలవంతంగా పోలీసులు అరెస్ట్ చేశారు. తాడిపత్రిలో ఉండరాదంటూ పోలీసుల ఆంక్షలు విధించారు. పెద్దారెడ్డిపై దాడులు చేసేందుకు జేసీ వర్గీయులు సమాయత్తం.. రహస్య ప్రాంతానికి పెద్దారెడ్డిని తరలించిన పోలీసులు.. ఎక్కడికి తరలిస్తారని అడిగిన చెప్పకుండా బలవంతంగా, తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.

## కావలి లో డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ కమిటీ స్పెషల్ డ్రైవ్



**కావలి రూరల్-పెన్ పవర్ జూన్ 29 :** నెల్లూరు జిల్లా ను బాలకార్మిక రహిత జిల్లా గా చేయాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ సూచనలతో సి.ఏ.సి.ఎల్. (క్యాంపెయినింగ్ ఎగైనెస్ట్ చైల్డ్ లేబర్) జిల్లా కన్వీనర్ అబ్దుల్ అలీం ఆధ్వర్యంలో శనివారం డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ కమిటీ కావలి, జలదంకి లోని పలు దుకాణాలను తనిఖీ చేసినారు. ఈ తనిఖీల్లో భాగంగా వారు దుకాణాల యజమానులతో మాట్లాడుతూ చిన్న పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమని, ఎక్కడైనా పిల్లలు పని చేస్తున్నట్లు కనిపిస్తే ఆ షాపు యాజమానిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. కేసు నమోదు అయితే చట్టపరమైన సమస్యలను ఎందుకోవాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులైన అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు పి. అనిల్ కుమార్, ఐ. వెంకటేశ్వర్లు, ఏ.ఎస్.ఐ. డి. సతీష్, సి.జె.డబ్ల్యూ.ఎస్. ప్రాజెక్టు కో ఆర్డినేటర్ జి. శుభకిరణ్, ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షురాలు షేక్ ఖాదర్ బీ పాల్గొన్నారు.

## మన చుట్టూ ఉన్న వ్యక్తుల పట్ల మనం ఎంత సున్నితంగా ఉన్నాం? నిస్వార్థ సేవ..

### పెన్ పవర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి

**కడప పెన్ పవర్ జూన్ 29 :** నిస్వార్థ సేవ రెండు-మూడు రోజుల క్రితం, నేను నా 8 ఏళ్ల కుమార్తెను పాఠశాల నుండి తీసుకురావడానికి మూడు గంటలకు పాఠశాల గేటు వద్దకు చేరుకున్నాను. జూనియర్ కె.జి. విద్యార్థులు మధ్యాహ్నం 3.10 గంటలకు, సీనియర్ విద్యార్థులు 3 గంటల నుంచి బయటకు రావడం ప్రారంభిస్తారు. గేటు వద్ద తల్లిదండ్రులు గుమిగూడి ఉన్నారు. అకస్మాత్తుగా భారీ వర్షం ప్రారంభమైంది. అందరూ గొడుగులు విప్పారు. నా పక్కన గొడుగు లేకుండా ఒక పెద్దమనిషి నిలబడి ఉన్నాడు. మర్యాద కోసం, నేను అతనిని నా గొడుగు కిందకు రమ్మన్నాను. అతను, "నేను కారులో నుండి హడావిడిగా బయటకి వచ్చాను, గొడుగు తీసుకురాలేకపోయాను", అన్నాడు. "ఫర్వాలేదు, కొన్నిసార్లు అలా జరుగుతుందిలెండి" అన్నాను. అతని పిల్లవాడు రెయిన్ కోట్ వేసుకుని బయటికి రాగానే వారిని గొడుగులో కారు దాకా తీసుకెళ్లాను. నా వైపు స్థిరంగా చూసి, థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు. నిన్న రాత్రి తొమ్మిది గంటలకు, మిస్టర్ పాటిల్ కొడుకు వచ్చి, "అంకుల్ మాకు కారు కావాలి. రూబీ (మిస్టర్ పాటిల్ ఆరు నెలల కుమార్తె) చాలా అనారోగ్యంతో ఉంది, ఆమెను డాక్టర్ వద్దకు తీసుకెళ్లాలి" అని చెప్పాడు. "పద వెళ్దాం" అన్నాను. వర్షం కురుస్తున్న ఆ చీకటిరాత్రిలో డాక్టర్ దగ్గరికి వచ్చేసరికి, డోర్ మేన్ గేటు మూసేస్తున్నాడు. "డాక్టర్ గారు చివరి పేషెంట్ ని చూస్తున్నారు, ఇప్పుడు ఇంక వెళ్ళిపోబోతున్నారు, మీరు సోమవారం ఆయన్ని చూడవచ్చు" అన్నాడు కాంపౌండర్. నేను కాంపౌండర్ ని ఇప్పుడే చూడనివ్వమని బ్రతిమాలబోతుండగా, డాక్టర్ ఇంటికి వెళ్లడానికి తన ఛాంబర్ నుండి బయటకు వచ్చాడు. నన్ను చూడగానే కంగారుపడుతూ, "అయ్యో! ఇలా వచ్చారు !! ఏమైందండీ?" అని అడిగాడు. చెప్పనవసరంలేదనుకుంటూ, నేను స్కూల్లో గొడుగులో కారుకు వద్దకు తీసుకెళ్లిన అదే పెద్దమనిషి, ఆ డాక్టర్. ఆ పాప నాకేమి అవుతుందని డాక్టర్ గారు అడిగారు. "ఈమె నా స్నేహితుడైన మిస్టర్ పాటిల్ కూతురు. మేము ఒకే సొసైటీలో నివాసిస్తున్నాం" అని అన్నాను. ఆ చిన్న పాపను చూసి, మందు రాసిచ్చి , 'వెంటనే ఈ ఇంజక్షన్ ఇవ్వండి, రెండు మూడు రోజుల పాటు మన దగ్గర ఉన్న మందులు ఇప్పించండి', అని కాంపౌండర్ కి సూచించాడు. నేను అభ్యంతరం చెప్పగా, "ఇప్పుడు ఈ వానరాత్రిలో మందులు వెతుక్కుంటూ ఎక్కడికి వెళ్తారు సార్!! మీ వర్ణంలోనే నన్ను కూడా వర్ణభరితమవ్వనివ్వండి", అన్నాడు నవ్వుతూ. ఎంత పట్టుబట్టినా డాక్టర్ గారు ఫీజు గానీ, మందుల ధర గానీ తీసుకోకుండా, తన కాంపౌండర్ తో, "ఈయన నా మిత్రుడు, ఎప్పుడు వచ్చినా వెంటనే లోపలకి పంపండి" అన్నాడు. మమ్మల్ని కారు దగ్గరకి దింపడానికి వచ్చి, "సార్, మీలాంటి నిస్వార్థ సామాజిక సేవకులు ఈ ప్రపంచంలో ఉంటారా?" అన్నాడు

మన శరీరం, మనస్సు, సంపద యొక్క అహంకారాన్ని వదిలిపెట్టి, అంచనాలు లేకుండా చేసే నిస్వార్థ సేవ నిజంగా మన అస్తిత్వానికి కొత్త కోణాన్ని ఇస్తుంది. మనం దైవత్వపు వర్ణంలో ఉండటం ప్రారంభిస్తాం, అప్పుడు మనం కూడా ఇతరుల ఉనికిని దైవత్వపు వర్ణంలోనే రంగువేయడం ప్రారంభించవచ్చు! ప్రశాంతంగా ఉండటం, మన భావోద్వేగాలను జయించడం ద్వారా, మన చుట్టూ ఉన్న ప్రతి ఒక్కరి పట్ల మనం మరింత సున్నితంగా, దయగా, ఉదారంగా, సహాయకరంగా, ప్రేమగా మారవచ్చు.



దాజీజి
హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం కడప.
అనువాదబృందం ఆంధ్రప్రదేశ్

## మహా న్యూస్ కార్యాలయంపై దాడి హేయమైన చర్య

### పలమనేరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్రతినిధులు



**పలమనేరు జూన్ 29, (పెన్ పవర్) :** మహా న్యూస్ కార్యాలయంపై దాడి హేయమైన చర్య అని పలమనేరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్,సోషల్ మీడియా సభ్యులు అన్నారు.ఆదివారం పట్టణంలోని చెన్నై - బెంగళూరు జాతీయ రహదారి పైన క్లాక్ టవర్ వద్ద ధర్నా,నిరసన చేపట్టారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ లోని మహా న్యూస్ ఛానల్ కార్యాలయంపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు.సభ్య సమాజం తలదించుకునే విధంగా మీడియా స్వేచ్ఛను హరిస్తూ బి.ఆర్.ఎస్.పార్టీ శ్రేణుల వ్యవహార శైలిని దుయ్యబట్టారు.దాడికి కారణమైన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలమనేరు నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు రమేష్, ప్రింట్ మీడియా అధ్యక్షులు శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో టీవీ9 నాగరాజు,టీవీ5 శరత్,10టీవీ బాబు, సివిఆర్ మోహన్, ఎన్.టీ.వీ భార్గవ్,1టీవీ మహబూబ్,జీ తెలుగు హేమంత్,స్వతంత్ర టీ.వీ మస్తాన్,ఏ.బీ.ఎన్. పవన్,సుమన్ టీ.వీ గుణ,డి.డి.న్యూస్ మస్తాన్,మహా న్యూస్ దేవేంద్ర,మరియు ప్రింట్ మీడియా అధ్యక్షులు శ్యామ్,కార్యదర్శి దిలీప్, సభ్యులు అనిల్, త్యాగరాజులు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.




## యడవల్లిలో పుష్పాలంకరణ వేడుకలలో పాల్గొన్న వైపాలెం దర్శి శాసనసభ్యులు టి చంద్రశేఖర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి





**పెద్ద దోర్నాల పెన్ పవర్ జూన్ 29 :** మండల పరిధిలోని యడవల్లి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిట్యాల వెంకటేశ్వరెడ్డి కుమార్తె పుష్పాలంకరణ వేడుక ఆదివారం శోభాయమానంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు దర్శి శాసనసభ్యులు డా. బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ హాజరయ్యారు. చిన్నారి పుష్పాన్ని ఆశీర్వదించి, కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. వేడుక సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు సంప్రదాయాలను సంరక్షించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గ్రామస్థులు, బంధువులు, స్థానిక నాయకులు పెద్దఎత్తున పాల్గొని వేడుకను మరింత శోభాయమానంగా మార్చారు. పుష్పాలంకరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన చిట్యాల కుటుంబానికి హర్షాతిరేకంతో అభినందనలు వెల్లువెత్తాయి. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ గంట వెంకట రమణారెడ్డి. చిట్యాల గంగరాజు. శ్రీరాములు సిహెచ్. యోగి రెడ్డి. దోర్నాల ఉపసర్పంచ్ దూదేకుల రసూల్. అల్లు వెంకటరమణారెడ్డి. చిట్టి వెంకటేశ్వర్ రెడ్డి. సేఫ్టీ డ్రైవర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వైసిపి టియుసి నియోజకవర్గ అధ్యక్షులు షేక్ షేక్షావలి. ఎస్ రామ కొండయ్య వై లింగారెడ్డి. ఎం మధుసూదన్ రెడ్డి. యడవల్లి వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలు పాల్గొన్నారు.

## మరణానికి కారణమయ్యే మత్తును తరిమేద్దాం




**శ్రీకాళహస్తి - పెన్ పవర్, జూన్ 29 :** సమాజంలో అత్యంత ప్రమాదకరంగా పరిణ మించి, మానవాళిని సమూలంగా నిర్వీర్యం చేస్తూ మనుషుల మరణానికి కారణమవుతున్న మత్తును సమాజం నుండి తరిమేద్దాం రండి అని తెలుగుదేశం పార్టీ, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు పిలుపునిచ్చారు. 'డ్రగ్స్ వద్దు - జీవితం ముద్దు' అనే నినాదంతో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం యొక్క పిలుపును అందుకుని తెలుగుదేశం పార్టీ, బిసి విభాగం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జయరాంరావు వీధి లోని, పూసల వీధి కూడలిలో మాదక ద్రవ్యాల నిరోధకంపై ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. గత వైసిపి ప్రభుత్వంలోని పెద్దలకు ప్రధాన ఆదాయ వనరుగా ఉండి, అరాచక వాదులకు టానిక్ వలె ఉపయోగపడిన గంజాయి మహమ్మారిని సమాజంలో లేకుండా సమూలంగా నాశనం చేయడానికి ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ నుండి మాదకద్రవ్యాల ముప్పును నిర్మూలించడానికి మరియు అందరికీ ఆరోగ్యకరమైన, సురక్షితమైన భవిష్యత్తును నిర్మించడానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం దృఢమైన చర్యలు చేపట్టి EAGLE అనే స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటు చేయడానికి చొరవ చూపడం జరిగింది. ఇది మాదక ద్రవ్యాల వ్యతిరేక పోరాటంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని పేర్కొన్నారు. ఇందుకు ప్రజల భాగస్వామ్యం కూడా అంతే ముఖ్యమైనదని, మాదకద్రవ్యాలను నిర్మూలించడానికి మరియు మన యువత శ్రేయస్సు మరియు భవిష్యత్తును కాపాడుకోవడానికి మనం పౌరులుగా, కుటుంబాలుగా మరియు సంస్థలుగా కలిసి సమిష్టిగా పోరాడితేనే మత్తు రహిత సమాజాన్ని చూడగలమని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరధాచారి, వన్నియకుల క్షత్రియ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు,మునిరాజా యాదవ్, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, బీమాల భాస్కర్, సయ్యద్ చాంద్ బాషా, మణి, భగత్, సంజాకుల మురళీకృష్ణ, బిజెపి నాయకుడు సుకుమార్, శివ, సులేమాన్, గగన్ యాదవ్, కృష్ణమూర్తి, అహ్మద్, రియాజ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాకర్స్ ఇంటర్నేషనల్ కౌన్సిల్ మీట్

(3వ పేజీ తరువాయి) మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం వైజాగ్ లో ఆల్వార్ దాస్ ఆధ్వర్యంలో పదిమంది సభ్యులతో ఏర్పడిన వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ నేడు అయిదు లక్షల మంది సభ్యులు కలిగి ఉన్నారన్నారు. భవిష్యత్తులో ఈ సంఖ్యను పది లక్షలకు చేర్చి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. పాస్ట్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు డాక్టర్ రామానందం మాట్లాడుతూ నూతనంగా ఎలక్టయినా గవర్నర్లకు విధివిధానాలను వివరించి ప్రతి మూడు నెలలకు ఒకసారి కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. డాక్టర్ శర్మ మాట్లాడుతూ సభ్యత్వ సంఖ్యను పెంచి క్లబ్బులను నూతనంగా ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ సందర్భంగా విశిష్ట సేవలు అందించిన ప్రముఖ వాకర్స్ లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభావతి, డాక్టర్ రవి రాజు, డాక్టర్ రమానందం, డాక్టర్ శర్మ, సీతారామయ్య, కృష్ణకుమారి, సుబ్బారెడ్డి, నాగ భూషణం, ఐజాక్, డాక్టర్ విజయలక్ష్మి,కోనేటి రవిరాజు, మాధవ నాయుడు, అమర్నాథ్, శ్రీ వినాయక సాగర వాకర్ అసోసియేషన్ అధ్యక్షులు సాంబ శివారెడ్డి, ఉపాధ్యక్షులు గుండ్రాజు సుకుమార్ రాజు, చేజర్ల సుబ్రహ్మణ్యం రాజు, శరత్ కుమార్ రాజు, పేరూరు సుధాకర్ రెడ్డి, కృష్ణారావు,గోపి, చల్ల ముని కృష్ణయ్య,ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, రావు కృష్ణారావు, సుబ్రహ్మణ్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

## నాడు రాజకీయ నియంతృత్వం .. నేడు మతతత్వ నియంతృత్వం




**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 29 :** నాడు ఇందిరా గాంధీ ప్రభుత్వం ప్రత్యక్ష ఎమర్జెన్సీ కొనసాగిస్తే నేడు అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతుందని సీపీఐ(ఎం) కార్యదర్శివర్గ సభ్యులు వి రాంభూపాల్ విమర్శించారు. అదివారం సీపీఐ(ఎం) ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాల అయిన సందర్భంగా ఎమర్జెన్సీ నాడు-నేడు అనే అంశంపై జరిగిన సదస్సు లో ఆయన మాట్లాడారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ కె మాబు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన రాంభూపాల్ మాట్లాడుతూ 1975లో జూన్ 25 అర్ధరాత్రి నాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని ప్రకటించి ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని, ప్రతిపక్షాల నాయకులను, విద్యార్థి నాయకులను, కార్మిక నాయకులను ప్రధానంగా సీపీఐ(ఎం) పార్టీ కార్యకర్తలు అందరిని మీసా చట్టం కింద అరెస్టు చేసి జైలు పాలు చేశారని ఆరోపించారు. 18 నెలలు పాటు నిర్బంధం కొనసాగినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు.రాయబరేలి లో తన గెలుపు చెల్లదని కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో పార్లమెంట్ లో తన ఓటు హక్కును కాపాడుకునేందుకు అప్రజాస్వామిక పద్దతిలో 356,ఆర్టికిల్ ప్రయోగించి పార్లమెంట్ లో చర్చ లేకుండా, కాబినెట్ ఆమోదం లేకుండా, రాష్ట్రపతి అనుమతి లేకుండా అర్ధరాత్రి వేళ తీవ్ర నిర్బంధం విధించినట్లు ఆరోపించారు. ఎమర్జెన్సీ కాలంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బిజెపి పోరాడినట్లు మోడీ ప్రకటించటం పచ్చి అబద్ధమని ఆరోపించారు. అప్పటి ఆర్ ఎస్ ఎస్ ద్వంద్వ విధానాలు అమలు చేసినట్లు పేర్కొన్నారు. ఎమర్జెన్సీ కి అనుకూలంగా వ్యవరిస్తున్నట్లు దేవరస్ 3సార్లు లేఖలు రాసిన అంశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎమర్జెన్సీ కాలంలో బెంగాల్ ప్రభుత్వం సిపిఎం పై తీవ్ర నిర్బంధం విధించినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ నిర్బంధ కాండ వల్ల 1148 మంది కార్యకర్తలు హత్య గావించబడ్డారని,వేలాది మంది ఆస్తులు లూటీ అయ్యాయని పేర్కొన్నారు. ఈ కాలంలో మీసా చట్టాన్ని ప్రయోగించి 38,418 మందిని,జాతీయ భద్రతా చట్టం కింద మరో 72,316 మందిని నిర్బంధించిందని, దేశవ్యాప్తంగా 1.18 లక్షల మంది అక్రమంగా అరెస్టు అయ్యారని ఈ సందర్భంగా వివరించారు. స్వాతంత్రం వచ్చిన తరువాత ఇటువంటి నిర్బంధం మరెన్నడు జరగలేదన్నారు. ఎమర్జెన్సీ కాలంలో ఎమర్జెన్సీని బలపరిచింది ఆర్ఎస్ఎస్ అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎమర్జెన్సీ పరిణామాల అనంతరం అధికారంలోకి వచ్చిన జనతా పార్టీని కూల్చింది కూడా ఆర్ఎస్ఎస్ శక్తులేనని ఆయన గుర్తు చేశారు. ఇందిరాగాంధీ కొనసాగించిన ఎమర్జెన్సీని మోడీ ప్రభుత్వం కొనసాగిస్తుందని ఆరోపించారు. మోడీ అధికారం చేపట్టిన 11 ఏళ్ల కాలంలో తీవ్ర నిర్బంధం కొనసాగుతున్నట్లు ఆరోపించారు.నేడు బిజెపి అధికారంలోకి వచ్చిన దశాబ్ద కాలం పైగా ప్రశ్నించే వారిని, నరేంద్ర మోడీని విమర్శించిన వారిని ఉపా చట్టం కింద అరెస్ట్ చేసి ఆరు నెలలకు పైగా బెయిల్ రాకుండా నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. విమర్శించిన వారిని జాతి ద్రోహులుగా , దేశ ద్రోహులుగా చిత్రీకరిస్తూ దాడులు చేస్తున్నారని న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రభీర్ పూరయస్త్, స్టాన్ స్వామి ఉదంతాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 351ఏ దేశద్రోహం చట్టం చెల్లదని సుప్రీం కోర్టు తీర్పు ను లెక్క చేయకుండా 459 పై అక్రమ కేసులుపెట్టి జైలు కు పంపగా కేవలం ఇద్దరి పై మాత్రమే రుజువు అయినట్లు తెలిపారు. కాగా ఉపా చట్టం కింద 10558 మందిని జైలుకు పంపిస్తే 457 మందిపై మాత్రమే రుజువు అయినట్లు గుర్తు చేశారు. రాజ్యాంగ హక్కులను కాలరాయడంతో పాటు రాజ్యాంగాన్నే మార్చేకుట్ర చేస్తున్నట్లు ఆరోపించారు. నాడు ప్రత్యక్ష నియత్రుత్వం కొనసాగితే నేడు పరోక్షంగా నియత్రుత్వం కొనసాగుతుందన్నారు. పహేల్గం దాడులు మొదలు ఆపరేషన్ సింధూర్ ఘటన వరకు జరిగిన ఏ అఖిల పక్ష సమావేశానికి హాజరు కావడం, లేదా పార్లమెంట్ ను సమావేశ పరచడం వంటి చర్యలు కంటే బీహార్ ఎన్నికలు ముఖ్యంగా భావిస్తున్న మోడీ తనకు తాను విశ్వ గురుగా ప్రకటించుకుంటున్నారని ఆరోపించారు. భిన్న మతాల ప్రజాస్వామ్య వ్యవస్థలో మతనియంతృత్వం కొనసాగాలని ఆర్ ఎస్ ఎస్, బి జె పి యోచిస్తుందని ఈ కారణంగా రాజ్యాంగం లోని సెక్యులరిజం, సోషలిజం పదాలు తొలగించే ప్రస్తావన తెస్తున్నట్లు ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో లౌకికశక్తులు ప్రజాతంత్ర వాదులు ఐక్యమై సెక్యులరిజాన్ని కాపాడుకోవాలన్నారు. కాగా మోడీ మతతత్వ నియంతృత్వాన్ని ఎదిరించడానికి సోషలిజం ఒక్కటే మార్గం అన్నారు. సదస్సులో పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ కె మాబు, కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు వై సిద్దయ్య, ఏ వి పుల్లారావు మాట్లాడారు. సదస్సులో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిజెపి నాయకునికి పలువురి పరామర్శ



**పొదిలి, పెన్ పవర్, జూన్ 29 :** భారతీయ జనతా పార్టీ నాయకునికి పలువురు పరామర్శించారు. బిజెపి మాజీ మండల అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి ఇటీవల అనారోగ్యకారణంతో వైద్యశాలలో చికిత్స పొంది తన స్వగ్రామమైన పొదిలి మండలంలోని కష్టాలపల్లి గ్రామానికి విచ్చేసి విశ్రాంతి తీసుకుంటున్నారు ఈ సమాచారం తెలుసుకున్న భారతీయ జనతా పార్టీ నాయకు లు పలువురు ఆదివారం నాడు శ్రీనివాసరెడ్డిని కలసి పరామర్శించారు అలాగే ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు శ్రీనివాసరెడ్డిని కలసిన వారిలో మండల బిజెపి అధ్యక్షులు దోర్నాల రమణారెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు మాగులూరి రామయ్య, మండల బిజెపి కార్యదర్శి సయ్యద్ ఖాదర్ భాష తదితరులు ఉన్నారు.

# అమ్మవారికి రెండో బోనం.. గోల్కొండకు పోటెత్తిన భక్తులు




**హైదరాబాద్ పెన్ పవర్:** చారిత్రాత్మక గోల్కొండ కోటలో ఈ నెల 26వ తేదీ నుంచి ఆషాడ బోనాల ఉత్స వాలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా రెండో పూజ ఆదివారం కావడంతో గోల్కొండ కోటకు భక్తుల తాకిడి పెరిగింది. దీంతో తెల్లవారుజామునుంచే భక్తులు గోల్కొండకు చేరుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ సందర్భంగా గోల్కొండ కోట పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.

దీంతో గోల్కొండ పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. గొల్కొండ కోటలోని జగదాంబిక అమ్మవారికి ప్రతి గురు, ఆదివారాల్లో భక్తులు అమ్మవారికి మొక్కులు సమర్పించనున్నారు.అమ్మవార్లకు 9 పూజలతో గోల్కొండ బోనాలు జరుగుతాయి. గోల్కొండ కోటలో నెలరోజుల పాటు బోనాల ఉత్సవాలు జరగనున్నాయి.గోల్కొండ కోటాలో మొదలైన బోనాలు జులై 24న తిరిగి గోల్కొండ కోటలో వేడుకలు ముగియనున్నాయి.

# యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య కేసులో పూర్ణచంద్ర నాయక్ కు రిమాండ్..



**హైదరాబాద్ పెన్ పవర్:** యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య కేసులో నిందితుడు పూర్ణచంద్ర నాయక్ ను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న క్రమంలో శనివారం ( జూన్ 28 ) రాత్రి చిక్కడపల్లి పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు పూర్ణచంద్ర. ఈ క్రమంలో ఆదివారం ( జూన్ 29 ) పూర్ణచంద్రను రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్. అతనిపై బి.ఎన్.ఎస్ యాక్ట్ 69 , 108 యాక్ట్ తో పాటు ఫోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు పోలీసులు. శనివారం రాత్రి పోలీసులు ఎదుట లొంగిపోయిన పూర్ణచంద్రను విచారణ అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి ఆదివారం కోర్టులో ప్రవేశపెట్టారు. యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య కేసు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో ఈ కేసులో మరిన్ని వివరాలు రాబట్టేందుకు నిందితుడు పూర్ణ చంద్ర నాయక్?ను పోలీసులు రిమాండ్ కు తరలించినట్లు తెలుస్తోంది. కాగా, యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. శుక్రవారం (జూన్ 27) రాత్రి జవహర్ నగర్?లోని తన నివాసంలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. స్వేచ్ఛ మరణానికి ఆమెతో సహజీవనం చేస్తోన్న పూర్ణ చంద్ర నాయకే కారణమని స్వేచ్ఛ తల్లిదండ్రులు చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీసులు పూర్ణ చంద్ర నాయక్?పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే స్టేషన్?లో లొంగిపోయిన అతడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు పోలీసులు

# మాజీ సీఎంకు ఏపీ బీజేపీ పగ్గాలు.. నిజమేనా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో బీజేపీ అధ్యక్ష పదవిని కొత్తవారికి అప్పగించేందుకు రంగం రెడీ అయింది. గత ఏడాది ఎన్నికలకు ముందు ఏపీ బీజేపీ సారథిగా పగ్గాలు చేపట్టిన మాజీ కేంద్ర మంత్రి, ప్రస్తుత రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి.. బీజేపీ–టీడీపీ–జనసేన కూటమి కట్టేందుకు.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బాగానే కృషి చేశారని చెప్పాలి. అయితే.. రెండేళ్లకు మాత్రమే పరిమితం అయ్యే ఈ పదవిని తాజాగా మార్పు చేయాలని బీజేపీ అధిష్టానం నిర్ణయించింది. మొత్తంగా 9 రాష్ట్రాల్లో బీజేపీ చీఫ్‌లను మార్చను న్నారు. వీరితోపాటు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాను కూడా మార్చేయనున్నారు.వాస్తవానికి ఈ ఏడాది జనవరితోనే ఏపీ బీజేపీ అధ్యక్షురాలు సహా.. 9 రాష్ట్రాల అధ్యక్షులను కూడా బీజేపీ మార్చాల్సి ఉంది. అయితే.. పార్లమెంటు సమావేశాలు, ఇంతలోనే పహిల్గాం ఉగ్రదాడి సహా పలు సమస్యలు రావడంతో నాయకులు ఈ విషయా న్ని పక్కన పెట్టారు. తాజాగా బీహార్ సహా వచ్చే ఏడాది పలు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. దీనికితోడు.. ఏపీలోనూ వచ్చే ఏడాది స్థానిక ఎన్నికలకుముహూర్తం పెట్టనున్నారు. ఈ క్రమంలో పార్టీ పరంగా మార్పు ఖాయమని కొన్నాళ్లుగా సూచనలు అందాయి. ఈ క్రమంలో కమల నాథులు క్యూ కట్టారు.కీలకమైన బీజేపీ ఏపీ చీఫ్ పదవిని దక్కించుకునేందుకు బీసీ, ఓసీ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు లైన్‌లో ఉన్నారు. వీరిలో ప్రధానంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చిట్ట చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి పేరు జోరుగా వినిపిస్తోంది. ఆయన కాంగ్రెస్‌ను వీడిన తర్వాత.. పలు పార్టీల్లోకి వెళ్లారు. చివరకు రెండేళ్ల కిందట బీజేపీ కండువా కప్పుకొన్నారు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట నియోజకవర్గం నుంచి పార్లమెంటుకుపోటీ చేశారు. కూటమి ప్రభావంతో చాలా మంది అభ్యర్థులు విజయం దక్కించుకున్నా కిరణ్‌కుమార్‌రెడ్డి పరాజయం పాలయ్యారు.ఈ క్రమంలో ఆయన కొన్నాళ్లుగా తన స్థాయికి తగిన పదవి కోసం వేచి చూస్తున్నారు. తాజాగా ఏపీ బీజేపీ చీఫ్ పదవి ఖాళీ అవుతుండడంతో ఆయనను నియమిస్తారన్న చర్చ జరుగుతోంది. దీనికి మరో కారణం కూడా వినిపిస్తోంది. రెడ్డి సామాజిక వర్గాన్ని ప్రభావితం చేయడం ద్వారా వైసీపీని టార్గెట్ చేయొచ్చని .. బీజేపీ నాయకులు భావిస్తున్నారు. ఇప్పుడు రెడ్డి సామాజిక వర్గం ఎక్కువగా వైసీపీకి అనుకూలంగా ఉంది. ఈ క్రమంలో తటస్థంగా కూడా చాలా మంది ఉన్నారు. వీరిని ఆకర్షించేందుకు కిరణ్ కుమార్ రాజకీయం పనిచేస్తుందన్న చర్చ ఉంది. ఈ నేపథ్యంలోనే కిరణ్‌కుమార్‌కు ఏపీ బీజేపీపగ్గాలు అప్పగించే అవకాశం ఉందని మెజారిటీ నాయకులు భావిస్తున్నారు. వచ్చే నెల 1న సాయంత్రానికి కానీ.. దీనిపై క్లారిటీ వచ్చేఅవకాశం లేదు.

# ఎనిమిది నెలల తర్వాత కళ్ళు తెరిచిన అధికారులు



- ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలలో సడలింపు జీవీఎంసీ భూములకు వర్తింపవా
- ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం వలన మూడు కుటుంబాలు వీధిన పడ్డాయి





పెన్ పవర్

ప్రభుత్వ భూమిలో ఆగని అక్రమ నిర్మాణాలు

అక్రమ నిర్మాణాలకు శాసనసభ్యుని పేరు వాడుకుంటున్న నాయకులు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం జూన్ 29:** జీవీఎంసీ జోన్ 2 13 వ వార్డు పరిధి రామకృష్ణాపురం లో శనివారం అక్రమ నిర్మాణాలు తొలగించిన అధికారులు. అక్రమ నిర్మాణాలు తొలగించిన ప్రాంతం ఒకప్పుడు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పందులను పెంచుకునే సీమ పందులు పెంపకం దారుల షెడ్ నిర్మాణం ఉండేది బి ఆర్ టి ఎస్ రోడ్లు విస్తరణలో భాగంగా ఈ ప్రాంతాన్ని రామకృష్ణాపురం తరలించిన సమయంలో పందులు ఫారం కూడా వేరే ప్రాంతానికి తరలించడం జరిగింది. అప్పుడు వరకు రెవెన్యూ భూముల్లో పరిధిలో ఉన్న ఈ ప్రాంతం జీవీఎంసీ కి ఎండార్స్ చేయడం జరిగింది అనంతరం రామకృష్ణాపురం కొంత భాగం రోడ్లు విస్తరణలో భాగంగా రామకృష్ణాపురంలో కొంత భాగాన్ని తరలించడం వారికి జిఎన్ఎల్ ఎస్ఎస్ఎన్ నగర్ ప్రాంతాలలో గృహ నిర్మాణాలను నిర్మించుకునేందుకు స్థలాలను కేటాయించడం గృహ సముదాయాలు కేటాయించడం జరిగింది. ఇదే ప్రాంతంలో పందులను మేపుకుంటూ జీవనం కొనసాగిస్తున్న కుటుంబాలు పందులు ఫారం షెడ్డు తొలగించిన ప్రాంతంలో గృహాలను నిర్మించుకుని ఉన్నారు. గతంలో ఈ ప్రాంతాన్ని జీవీఎంసీ అధికారులు ప్రాంతాన్ని ఖాళీ చేయించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం ఇదిలా ఉండగా ఈ ప్రాంతంలో పందులు పెంచుకుంటున్న కుటుంబాలలో కొందరు ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారు సుమారు ఎనిమిది నెలల క్రితం మూడు కుటుంబాలు ఇళ్లను నిర్మించుకున్నారు. వారిలో ఒక కుటుంబ యజమాని వికలాంగులు కావడం ఎస్సీ సామాజి వర్గానికి చెందిన వారు ఉన్నారు. ఇదే ప్రాంతంలో కొంతమంది ఇళ్ళను నిర్మించుకునేందుకు ప్రయత్నించగా టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మించిన నిర్మాణాలను తొలగించడం జరిగింది. ఇదిలా ఉండగా శనివారం జీవీఎంసీ అధికారులు రెవెన్యూ జీవీఎంసీ పోలీస్ సిబ్బందితో వచ్చి ఆ ఇళ్లను పోల్చివేయడం జరిగింది. అనంతరం అధికారులు ఇది ప్రభుత్వ భూమిగా గుర్తిస్తూ హెచ్చరిక బోర్డులను పెట్టారు. ఇంతవరకు బానే ఉంది కానీ ప్రభుత్వం కొలగొట్టిన కూలర్ దోసిన ఇల్లు గత ఎనిమిది నెలలుగా నివాసం ఉంటున్న ఇంతవరకు ఆ ఇల్లంపై ఎటువంటి చర్యలు చేపట్టిన అధికారులు అకస్మాత్తుగా వచ్చి ఇళ్లను తొలగించడం ఎంతవరకు సమంజసమని దారపాలెం పైనాపిల్ కాలనీ పరిసర ప్రాంతాలలో సర్వేనెంబర్ 15/12 , 22 ఏ, 26 .27 సర్వే నంబర్లు గల ప్రాంతాలలో ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ గత కొద్దిరోజులు క్రితం స్థానిక ఎమ్మార్వో 15/12 మూడెకరాల 16 సెంట్లు మరియు పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూములు గుర్తించి 22 ఏ లో కలపడం జరిగింది ఇది ఇలా ఉండగా ఆ ప్రాంతాలలో నిర్మించిన నిర్మాణాలు వదిలిపెట్టి మిగిలిన ప్రభుత్వ భూములలో హెచ్చరికలు బోర్డులు ఏర్పాటులు చేసి ప్రభుత్వ భూములుగా గుర్తించవలసిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జీవీఎంసీ పరిధిలో ఉన్న ఈ మూడో ఇళ్లను అలాగే ఉంచి వారి నిర్మాణాలు జోలికి వెళ్లకుండా ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని ప్రభుత్వం స్వాధీనపరచుకొని హెచ్చరిక బోర్డు%శ్రీబ% ఏర్పాటు చేయకుండా ఉన్న ఇళ్లను కూలద్రోయడం ఎంతవరకు సమంజసమని పలువురు అధికారులు తీరును తప్పు పడుతున్నారు. అధికారులకు తనికులు భూ అక్రమంగా చేసే వారికి వత్తాసు పలకడం వారికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న ప్రభుత్వ అధికారులు తీరును ప్రజలు తప్పుపడుతున్నారు కోటగడం కష్టంగా ఉన్న కుటుంబాలు తలదాచుకునేందుకు నిర్మించుకున్న నిర్మాణాలు కొలగొట్టడం ఎంతవరకు సమంజసం అని పెద్దలు ఇళ్ళకు ఇచ్చిన సవరణలు వీరికి వర్తించకపోవడం, అదే ప్రాంతంలో నిర్మించిన నిర్మాణం అధికారులు కంటికి కనిపించకపోవడం విమర్శలకు దారి తీస్తున్నాయి సమీపంలో పశువుల కొట్టాలను తొలగించడం దాని ప్రక్కనే ఉన్న అనధికార నిర్మాణం అధికారులు తొలగించుకోవడం స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. కొంతమంది స్వార్ధ రాజకీయాలకు అమాయకులను బలి చేస్తున్నారని. పెద్దలపై పెత్తనం చెలాయించలేని అధికారులు ఒక సామాజిక వర్గానికి చెందిన వారిని బలి పశువులను చేయడం ఎంతవరకు సమంజసమని ప్రజల ప్రశ్నిస్తున్నారు ప్రభుత్వ భూములను అన్యక్రాంతం అవుతున్న పట్టి ప్రణాళిక విభాగం అధికారులకు ఈ మూడు ఇల్ల నిర్మాణాలను తొలగించడం ఎంతవరకు సమంజసం అని ధనికులకు బడా బాబులకు కొమ్ముకాసే అధికారులు చిన్నవారిపై చులకన భావం చూపించడం వారిలను పోల్చడం ప్రభుత్వ చేతగానితనమని ప్రజల ఎద్దేవ చేస్తున్నారు.

ఈ మూడు ఇల్లు నిర్మిస్తున్న సమయంలోనే మొదటిలోనే నిర్మాణాలను అడ్డుకున్నట్లయితే వీరికి ఆర్థికంగా నష్టం వాటిల్లేదు కాదని నిర్మాణం పూర్తయిన తర్వాత ఎనిమిది నెలల కాలం తర్వాత వీటిని తొలగించడం ఎంతవరకు సమంజసమని బడుగు బలహీన వర్గాలను కాపాడవలసిన అధికారులు వారి ప్రతాపం వీరిపై చూపించడం సరికాదని ఆ కుటుంబాలు ఆర్థిక భారంతో పోటగడం కష్టం పరిస్థితుల్లో వారి జీవనం కొనసాగిస్తున్న సమయంలో ఇళ్లను పూల్చివేయడం సరికాదని ప్రభుత్వాధికారులు తీరును ప్రజలు తప్పుపడుతున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇల్లందు నిర్మించుకుంటున్న సమయంలోనే అడ్డు చెప్పని అధికారులను తీరుపై అధికారులపై చర్య చేపట్టాలని వారికి కలిగిన నష్టాన్ని ప్రభుత్వాధికారులు తీర్చాలని అదే ప్రాంతంలో వాళ్ళు పునర్మించుకునేందుకు అవకాశం కల్పించాలని ప్రభుత్వ భూముల్లో నిర్మిస్తున్న నిర్మాణాలు ఇతర వ్యక్తులకు వర్తించిన నిబంధనలు వీరికి కూడా వర్తింప చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

**అధికారులు తీరును తప్పుపడుతున్న ఎస్సీ సామాజిక వర్గాలు ప్రతినిధులు**

ఎస్సీలకు కేటాయించిన స్థలంలో వీరినిర్మాణం నిర్మించుకునే సమయంలోనే నిర్మాణాలకు అడ్డు చెప్పి ఉండవలసింది అని ఆ సమయంలో ఎటువంటి చర్యలు చేపట్టుకుపోగా నిర్మాణాలు పూర్తయి ఎనిమిది నెలలు పూర్తయిన తరువాత ఇటువంటి చర్యలు చేపట్టి అకస్మాత్తుగా నిర్మాణాలను తొలగించడం వారి కుటుంబాలను వీధిపాలు చేయడం ఎంతవరకు సమంజసమని వారు అధికారులు తీరును ప్రశ్నిస్తున్నారు. నిర్మించిన నిర్మాణం మూడు ఇళ్ల నిర్మాణాలను అలానే ఉంచి మిగిలిన ప్రాంతంలో ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ఉండి ఉన్నట్లయితే బాగుండేదని ఇప్పటికైనా అధికారులు వారికి తగిన న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 13 వ వార్డుకు చెందిన నాయకులు ప్రజా సమస్యలను పక్కనపెట్టి వారి స్వప్రయోజనాల కోసం ఈ ప్రాంతంలో జరుగుతున్న అనధికార అక్రమ నిర్మాణాలకు కొమ్ముకాస్తూ పెద్ద మొత్తాలతో జేబులు నింపుకుంటున్న ప్రముఖ నాయకులు తీరు ప్రజా ప్రతినిధుల దృష్టికి వెళ్లినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడంతో వీరి ఆగడాలకు అంతే లేకుండా పోతుంది. ఈ ప్రాంతంలో వీరు చెప్పిందే వేదం ఒక కొంప నిలవాలన్నా కూలగొట్టాలని వీరి కనుసనల్లోనే జరుగుతున్నాయి అన్నది అందరికీ తెలిసిన విషయమే. ముఖ్యంగా ఈ 13 వ వార్డు ప్రముఖులుగా చెప్పుకుంటున్న నాయకుల తీరుపై విచారణ చేపట్టాలని,వీరు తీరు నచ్చని కొందరు నాయకులు చేసేది ఏమీ లేక మౌనం గానే ఉంటున్నారు. ఇప్పటికైనా మీరు తీరు పట్ల స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించాలని, నాయకులు వారి స్వప్రయోజనాలను పక్కనపెట్టి పార్టీ అభివృద్ధి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ అభిమానులు కోరుతున్నారు. అదేవిధంగా రామకృష్ణాపురంలో జరిగిన ఘటనపై స్థానిక ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి బాధితులకు న్యాయం చేయాలని, బాధితులు నిర్మించుకున్న నిర్మాణాలను ఆదిలోనే నిర్మూలించినట్లయితే వారికి ఆస్తి నష్టం సంభవించకుండా ఉండేదని వారు వీధిపారు కాకుండా ఉండే వారిని ఈ విషయమై స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టి సారించి వారికి తగిన న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు

# ఎన్నికల సంఘం సంచలనం.. మీ మొబైల్‌లోనే మీ ఓటు..!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఎన్నికలు అనగానే ఓటర్లకు, ఓట్లకు కూడా ప్రాధాన్యం ఉన్న విషయం అంతా ఇంతాకాదు. అప్పటి వరకు సాధారణ జీవితం గడిపిన పౌరుడు కూడా.. ఓటరు మహాశయుడిగా, ఓటరు దేవుడిగా మారిపోతాడు. అది ప్రజాస్వామ్య దేశాల్లో ముఖ్యంగా భారత్ వంటి అతి పెద్ద దేశాల్లో ఓటుకు ఉన్న వాల్యూ. ఇక, ఓటు హక్కు వినియోగించుకునే విధానాల్లోనూ మార్పులు వస్తున్న విషయం తెలిసిందే. అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుని కేంద్ర ఎన్నికల సంఘం ఓటు హక్కును వినియోగించుకునే ప్రక్రియను ఇప్పటికి రెండు సార్లు మార్చింది. దీనిలో ఒకప్పుడు బ్యాలెట్ ఓటు ప్రక్రియ ఉండేది.

స్లిప్పులపై ఉన్న ఎన్నికల గుర్తుపై ముద్ర వేసి బ్యాలెట్ బాక్సులో వేసే విధానం. పంచాయతీల్లో ఇప్పటికీ ఈ విధానం అమలు అవుతున్నా.. సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం లేదు. దీని స్థానంలో ఈవీఎంలను తీసుకువచ్చారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా.. మిషన్‌పై ఉన్న బటన్‌లలో ఒక దానిని నొక్కి ఓటరు తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునే విధానం. ప్రస్తుతం ఇదే దేశవ్యాప్తంగా అమలవుతోంది. అయితే..దీనిపై అనేక సందేహాలు, అనుమానాలు వస్తూనే ఉన్నాయి. కానీ.. ఎన్నికల సంఘం మాత్రం ఈవీఎంలలో ఎలాంటి దోషం లేదని చెబుతోంది. పైగా ఈవీఎంలను ఎవరూ హ్యాక్ చేయడం సాధ్యంకాదని ఇటీవల కొన్ని మాసాలకు ముందు సుప్రీంకోర్టుకు కూడా వివరించింది.అయినప్పటికీ.. అధికారం కోల్పోయిన వారు.. అధికారంలోకి వస్తామని ఆశలు పెట్టుకున్నవారు మాత్రం తరచుగా ఈవీఎంలపై నే విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ క్రమంలో మరిన్ని మార్పుల దిశగా కేంద్ర ఎన్నికల సంఘం అడుగులు వేస్తోంది. ఓటు బేసే ప్రక్రియలో మరో మార్పు దిశగా అడుగులు వేసింది. ప్రస్తుతం రూపొందించిన ప్రత్యేకయాప్ ద్వారా ఓటర్లు తమ మొబైల్ ఫోన్ల నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. ప్రత్యక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని.. దానిలో వివరాలు నమోదు చేయడం ద్వారా ఓటర్లుతమ ఓటు వేసే అవకాశం అందుబాటులోకి రానుంది.

**ప్రస్తుతానికి పరిమితంగా..**

తాజాగా ఎన్నిక లసంఘం రూపొందించిన ప్రత్యేక యాప్‌ను ఈ ఏడాది జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి ప్రవేశ పెట్టనున్నారు. ఈ–ఓటింగ్‌లో పాల్గొనాలనుకునే వారికోసం %వ–ాజుజదీ=% యాప్‌ను రూపొందించారు. ఓటర్ ఐడీ, ఫోన్ నంబర్ సాయంతో ముందుగా ఇందులో రిజిస్టర్ చేసుకోవాలి. పోలింగ్ జరిగే రోజు నిర్దేశించిన సమయంలో ఎప్పుడైనా ఈ యాప్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. సీ–డాక్ సంస్థ అభివృద్ధి చేసిన ఈ యాప్ అందుబాటులోకి వచ్చింది. కాగా.. ఒక మొబైల్ ఫోన్ నుంచి కేవలం ఇద్దరు ఈ–ఓటర్లు మాత్రమే ఓటు వేసే వీలుంటుందని బీహార్ అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియ సక్సెస్ అయితే.. వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి.. లేదా ఈ లోగా జరిగే పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ మొబైల్ ఓటింగ్ విధానం అందుబాటులోకి తీసుకువస్తారు. ఓటు వేసిన తర్వాత..ఎవరికి ఓటు వేశారనేది పీడీఎఫ్ రూపంలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

# సెంచరీతో చెలరేగిన స్మృతి మంధాన.. ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో టీమిండియా బోణీ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకున్న ఇండియా విమెన్స్‌జట్టు.. ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో బోణీ చేసింది. బ్యాటింగ్‌లో వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (62 బాల్స్‌లో 15 ఫోర్లు, 3 సిక్స్‌లతో 112), హర్లీన్ డియోల్ (23 బాల్స్‌లో 7 ఫోర్లతో 43), బౌలింగ్‌లో శ్రీ చరణి (4/12) చెలరేగడంతో.. శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో ఇండియా 97 రన్స్ తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. దీంతో సిరీస్‌లో 1–0 లీడ్‌లో నిలిచింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇండియా 20 ఓవర్లలో 210/5 స్కోరు చేసింది. తర్వాత ఇంగ్లండ్ 14.5 ఓవర్లలో 113 రన్స్‌కే కుప్పకూలింది. కెప్టెన్ సివర్ బ్రంట్(42 బాల్స్‌లో 10 ఫోర్లతో 66) టాప్ స్కోరర్. సమయోచితంగా రాణించిన ఇండియా బౌలర్లు ఇంగ్లండ్ లైనప్‌ను పేకమేడలా కూల్చారు. దీంతో ఆర్లాట్ (12), బ్యూమోంట్ (10)తో సహా అందరూ ఫెయిలయ్యారు. ఇన్నింగ్స్?లో 8 మంది సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితం కావడంతో ఇంగ్లండ్ ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. దీప్తి శర్మ, రాధా యాదవ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. మంధానాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఇరుజట్ల మధ్య రెండో టీ20 మంగళవారం బ్రిస్టల్?లో జరుగుతుంది.

**ఓపెనర్లు అదుర్స్..**

ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇండియాకు ఓపెనర్లు షెఫాలీ వర్మ (20), మంధాన అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. ఎదుర్కొన్న తొలి బాల్‌ను బౌండ్రీగా మల్చిన మంధాన ఇంగ్లిష్ బౌలింగ్‌ను చితక్కొట్టింది. రెండో ఓవర్‌లో రెండు ఫోర్లు కొడితే, తర్వాతి ఓవర్‌లో షెఫాలీ రెండు బౌండ్రీలు రాబట్టింది. నాలుగో ఓవర్‌లో మూడు ఫోర్లతో మంధాన 14 రన్స్ చేయగా, తర్వాతి రెండు ఓవర్లలో 9 రన్సే వచ్చాయి. దీంతో పవర్‌ప్లేలో ఇండియా 47/0 స్కోరు చేసింది. ఏడో ఓవర్‌లో గేర్ మార్చిన మంధాన రెండు సిక్స్‌లు, షెఫాలీ ఫోర్ బాదింది.

ఆ వెంటనే మరో రెండు ఫోర్లతో మంధాన 27 బాల్స్‌లో ఫిఫ్టీ పూర్తి చేసింది. అయితే 9వ ఓవర్‌లో షెఫాలీ ఔట్ కావడంతో తొలి వికెట్?కు 77 రన్స్ పార్ట్‌నర్‌షిప్ ముగిసింది. ఈ దశలో వచ్చిన హర్లీన్ డియోల్ కూడా బ్యాట్ ఝుళిపించింది. వరుసగా నాలుగు ఫోర్లతో టచ్‌లోకి వచ్చింది. దాంతో ఫస్ట్ టెన్‌లో ఇండియా 98/1 స్కోరుతో నిలిచింది. 11వ ఓవర్‌లో మంధాన సిక్స్‌తో మరింత జోష్ పెంచగా, 12వ ఓవర్‌లో డియోల్‌ఇచ్చిన క్యాచ్‌ను వ్యాట్–హాడ్జ్ జారవిడిచింది. అయినప్పటికీ వికెట్ల మధ్య వేగంగా రన్స్ తీస్తూ రన్‌రేట్‌ను పెంచారు.

14, 15వ ఓవర్‌లో మంధాన నాలుగు ఫోర్లు కొట్టడంతో స్కోరు 160/1కి పెరిగింది.

16వ ఓవర్‌లో రెండు ఫోర్లు కొట్టిన మంధాన 51 బాల్స్‌లో సెంచరీ అందుకుంది. టీ20ల్లో ఆమెకు ఇది తొలి సెంచరీ కావడం విశేషం. కానీ ఇదే ఓవర్‌లో డియోల్ ఔట్ కావడంతో రెండో వికెట్‌కు 94 రన్స్ పార్ట్‌నర్‌షిప్ ముగిసింది. మూడు ఫోర్లతో ఖాతా తెరిచిన రిచా ఘోష్ (12)తో పాటు జెమీమా రోడ్రిగ్స్ (0)ను 18వ ఓవర్‌లో లారెన్ బెల్ (3/27) పెవిలియన్‌కు పంపింది. లాస్ట్ ఓవర్‌లో మరో ఫోర్ కొట్టి మంధాన ఔటైనా స్కోరు రెండొందలు దాటింది.

**సంక్షిప్త స్కోర్లు**

ఇండియా: 20 ఓవర్లలో 210/5 (మంధాన 112, హర్లీన్ డియోల్ 43, లారెన్ బెల్ 3/27). ఇంగ్లండ్: 14.5 ఓవర్లలో 113 రన్స్ ఆలౌట్ (సివర్ బ్రంట్ 66, శ్రీ చరణి 4/12).

# కోహ్లీ అద్భుతం.. కానీ అతడే అసలైన గేమ్ ఛేంజర్: టీ20 ఫైనల్‌పై రోహిత్

**టీ20 ప్రపంచకప్ ఫైనల్ ఒత్తిడిపై నోరు విప్పిన రోహిత్ శర్మ**

**మూడు వికెట్లు పడగానే డగౌట్‌లో కంగారుపడ్డానని వెల్లడి**

**కోహ్లీ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడని ప్రశంస**

**అక్షర్ పటేల్ ఇన్నింగ్సే మ్యాచ్‌ను మలుపు తిప్పిందని స్పష్టం**



**హైదరాబాద్ పెన్ పవర్:** సరిగ్గా ఏడాది క్రితం ఇదే రోజున దక్షిణాఫ్రికాను చిత్తు చేసి, టీమిండియా రెండోసారి టీ20 వరల్డ్‌కప్ 2024ను ముద్దాడిన విషయం తెలిసిందే. దక్షిణాఫ్రికాతో జరిగిన హోరాహోరీ పోరులో భారత జట్టు విజయం సాధించింది. అయితే, ఆ మ్యాచ్‌లో టీమిండియా ఇన్నింగ్స్ ఆరంభంలోనే తాను, రిషబ్ పంత్, సూర్యకుమార్ యాదవ్ వంటి కీలక బ్యాటర్లు పెవిలియన్ చేరినప్పుడు డగౌట్‌లో తాను తీవ్రమైన కంగారుకు గురయ్యానని అప్పటి కెప్టెన్ రోహిత్ శర్మ తాజాగా వెల్లడించాడు. క్లిష్ట పరిస్థితుల్లో విరాట్ కోహ్లీ, అక్షర్ పటేల్ నిర్మించిన కీలక భాగస్వామ్యమే జట్టును తిరిగి రేసులోకి తెచ్చిందని హిట్‌మ్యాన్ ప్రశంసించాడు. స్టార్ స్పోర్ట్స్‌తో మాట్లాడుతూ రోహిత్ శర్మ ఆనాటి ఒత్తిడిని గుర్తుచేసుకున్నాడు. "మేం ముందుగా మూడు వికెట్లు కోల్పోయిన తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌లో తీవ్రమైన ఆందోళన నెలకొంది. నేను చాలా కంగారుపడ్డాను. సౌకర్యంగా అస్సలు లేను. మేమే దక్షిణాఫ్రికాను మ్యాచ్‌లోకి ఆహ్వానించామని భావించాను" అని తెలిపాడు. ఆ సమయంలో క్రీజులో ఉన్న కోహ్లీ అద్భుతంగా ఆడాడని కొనియాడాడు. టోర్నమెంట్ ఆసాంతం పెద్దగా రాణించకపోయినా ఫైనల్లో తన అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చాడని అన్నాడు."ఏ క్రికెటర్ అయినా తొలి ఓవర్లోనే మూడు బౌండరీలు కొడితే మంచి ఆరంభం లభించినట్లే. అది చాలా ఒత్తిడిని తగ్గిస్తుంది. విరాట్‌కు కూడా అదే జరిగింది. ఎన్నో ఏళ్లుగా భారత్ తరఫున ఆడుతున్న అనుభవం అతనికి ఉంది. భావోద్వేగాలను, ఆలోచనలను నియంత్రించుకుని, వర్తమానంలో ఎలా ఉండాలో అతనికి తెలుసు. 'ఈ రోజు నేను ఏకాగ్రతతో ఆడాలి' అని అతను బలంగా అనుకుని ఉంటాడు. అందుకే అంత అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు" అని రోహిత్ వివరించాడు.అయితే, కోహ్లీ ఇన్నింగ్స్ మ్యాచ్‌కు కీలకంగా నిలిస్తే, అక్షర్ పటేల్ ఆడిన ఇన్నింగ్సే గేమ్‌ను మలుపు తిప్పిందని రోహిత్ అభిప్రాయపడ్డాడు. "అక్షర్ ఇన్నింగ్స్ గురించి ఎక్కువ మంది మాట్లాడటం లేదు. కానీ, అదే అసలైన గేమ్ ఛేంజర్. ఆ దశలో 31 బంతుల్లో 47 పరుగులు చేయడం చాలా కీలకం. మాకు ఒక ఎండ్‌లో చివరి వరకు నిలిచే బ్యాటర్ అవసరం కాగా, విరాట్ ఆ పాత్రను అద్భుతంగా పోషించాడు. ఆ తర్వాత వచ్చిన శివమ్, అక్షర్, హార్దిక్ తమ వంతు పాత్ర పోషించడంతో మేం మంచి స్కోరు సాధించగలిగాం" అని రోహిత్ చెప్పుకొచ్చాడు.ఇక, ఈ ఫైనల్ మ్యాచ్‌లో కోహ్లీ 59 బంతుల్లో 76 పరుగులు చేసి జట్టుకు అండగా నిలిచాడు. ఈ చారిత్రక విజయం తర్వాత గంటల వ్యవధిలోనే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ పొట్టి ఫార్మాట్‌కు తమ రిటైర్మెంట్ ప్రకటించగా, ఆ మరుసటి రోజు రవీంద్ర జడేజా కూడా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే.



**ఫ్రెంచ్ అమ్మాయి మేకప్‌లో అవ్నీత్ కౌర్**

# దగ్గుబాటి రానా సంపదలు ఆర్జన విలువ?



రానా దగ్గుబాటి.. టాలీవుడ్ లో రేర్ ట్యాలెంట్. నటుడు.. నిర్మాత.. స్టూడియో యజమాని.. హోస్ట్.. క్రియేటర్.. పరోపకారి.. ఇలా విభిన్న కోణాల్లో అతడిని చూడొచ్చు. అతడు ఇప్పటికే 15 సంవత్సరాల కెరీర్ ని పూర్తి చేసాడు. ఇన్నేళ్లలో రానా సంపాదన ఎంత ఉంటుంది? అంటే సినిమాలు, బుల్లితెర హోస్టింగ్ సహా పలు వ్యాపార మార్గాల ద్వారా అతడు సుమారు 150 కోట్లు పైగా ఇండివిడ్యువల్ గానే సంపాదించాడని ఒక అంచనా. లెజెండరీ తాత దగ్గుబాటి రామానాయుడు సంపాదించినది.. డాడ్, అగ్రనిర్మాత డి.సురేష్ బాబు సంపాదించినది అతడు వృధా చేయలేదు. వారు ఇచ్చిన వందల కోట్ల ఆస్తులకు తన సంపాదనను అదనంగా జోడించాడు. ఇప్పటికి రానా పేరున ఏకంగా 150 కోట్ల విలువ చేసే ఆస్తులు ఉన్నాయిని టాక్ వినిపిస్తోంది. ఒక గొప్ప కుటుంబ బ్యాక్ గ్రౌండ్ నుంచి వచ్చి ఈ స్థాయికి ఎదిగాడు అంటూ ఆసక్తికర చర్చ సాగుతోంది.

ఇటీవల సినిమాల పరంగా స్లో అయిన రానా తన బాబాయ్ విక్టరీ వెంకటేష్‌తో కలిసి %-%రానా నాయుడు సీజన్ 2%-% సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఇకపోతే రానా ఏడాదికి రూ.6-8 కోట్ల మినిమం వార్షికాదాయం ఆర్జిస్తున్నాడనేది ఒక సర్వే. అతడు అంతకంతకు తన ఆదాయ మార్గాల్ని పెంచుకుంటున్నాడు. వ్యాపారాలు, వాణిజ్య ప్రకటనల రూపంలో ఆర్జన పెంచుకుంటున్నాడు. 2010లో - లీడర్ - చిత్రంతో కెరీర్ ప్రారంభించి ఈ పదిహేనేళ్లలో అతడు సాధించిన ఘనత ఇది. సొంత ఇల్లు, లగ్జరీ కార్లు అతడి సొంతం. హైదరాబాద్ జూబ్లీహిల్స్ లో 45 కోట్ల ఖరీదైన సొంత ఇల్లు ఉంది. ఈ ఇంట్లో ఒక సెక్షన్ ని ఇటీవల రెస్టారెంట్ గా కూడా మార్చారని కథనాలొచ్చాయి. ఇక 2.73కోట్ల విలువ చేసే మెర్సిడెస్ బెంజ్ ఎస్–క్లాస్, అలానే 1.32కోట్ల విలువ చేసే బీఎండబ్ల్యూ 7 సిరీస్ కార్ అతడి సొంతం. అతడు వాడే వాచ్ ల ఖరీదు లక్షల్లోనే. హ్యూబ్లోట్ మెక్సికన్ బ్రాండ్ వాచ్ ఖరీదు 8.16లక్షలు.. అలాగే టీఏజీహ్యూర్ గ్రాండ్ ప్రిక్స్ వాచ్ ఖరీదు 3.25లక్షలు.. ఉంటుంది. అలాగే అతడి వద్ద ఖరీదైన వస్తువులు ఇంకెన్నో ఉన్నాయి. రానా తన ఫిలింనగర్ ఇంట్లోనే బాల్యం అంతా గడిపాడు. ఇక ఈ ఇంటిలో ప్రారంభించిన రెస్టారెంట్ డిజైనర్ లుక్ తో ఎంతో శోభాయమానంగా ఉంటుంది. ఆశ్రిత దగ్గుబాటి యూట్యూబ్ ఛానల్ ఇన్ఫినిటీ ప్లాటర్‌లో షేర్ చేసిన పాత వీడియోలో, రానా తన బాల్యంలోని కొన్ని అందమైన జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఈ ఇంటికి సంబంధిం చిన చాలా వివరాలు అందించిన సంగతి తెలిసిందే. ఇక రానాకు హైదరాబాద్‌తో పాటు, ఈ రెస్టారెంట్‌కు గోవాలో మరొక శాఖ ఉంది.

**తాత నుంచి వారసత్వ సంపద?**

మరోవైపు రానా తండ్రి దగ్గుబాటి సురేష్ బాబు, తాత రామానాయుడు ద్వారా భారీ ఆస్తులు సంక్రమించనున్నాయి. వీటి విలువ వేల కోట్లు అనే టాక్ ఉంది. వీటిలో హైదరాబాద్ రామానాయుడు స్టూడియోస్, నానక్ రామ్ గూడ స్టూడియోస్ (రియల్ వెంచర్లు ఇక్కడ ప్లాన్ చేసారని టాక్ వచ్చింది), అలాగే సొంత థియేటర్లు, భారీగా హైదరాబాద్ ఔటర్ లో స్థలాలు, విశాఖలో ఆస్తులు, పలు రియల్ వెంచర్లలో అపార్ట్ మెంట్లు వగైరా సంపదల గురించి చాలా చర్చ సాగుతోంది.



**రాషా తడాని స్టైలిష్ వీకెండ్ లుక్**

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com